RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | బుధవారం, మే 27, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 37 | పేజీలు: 8 | వెల : రూ.1



ఐపీఎల్-2026 ఫైనల్లోకి

**దూసుకెళ్లిన ఆర్సీబీ...**

::: గుజరాత్‌కు మరో చాన్స్

## తెలంగాణలో రేషన్ కార్డుల ఏరివేత



హైదరాబాద్, మే 26 ( వాయిస్ టుడే ) : తెలంగాణలో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి తెల్ల రేషన్ కార్డులు పొందిన ప్రభుత్వ, భారీగా వేతనాలు పొందే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కార్డులను పౌరసరఫరాల శాఖ రద్దు చేస్తోంది. రూ. 6 లక్షల కంటే ఎక్కువ వార్షిక ఆదాయం ఉండి ఐటీ రిటర్న్స్ దాఖలు చేసేవారిని, పరిమితికి మించి భూమి ఉన్నవారిని అనర్హులుగా గుర్తిస్తున్నారు. అయితే బ్యాంకు రుణాల కోసం తప్పుడు ఆదాయం చూపిన నిజమైన అర్హులకు అన్యాయం జరగకుండా అధికారులు క్షేత్రస్థాయి విచారణ జరుపుతున్నారు. తెలంగాణలో నిరుపేదలకు అందాల్సిన తెల్ల రేషన్ కార్డులను దుర్వినియోగం చేస్తున్న అనర్హులపై పౌరసరఫరాల శాఖ ఉక్కుపాదం మోపుతోంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు సమాచారంతో కార్డులు పొంది ఇన్నాళ్లూ దర్జాగా రేషన్ బియ్యాన్ని, ఇతర ప్రభుత్వ సదుపాయాలను అనుభవిస్తున్న వారి ఏరివేత ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఈ తనిఖీల్లో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగుచూశాయి. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న కొందరితో పాటు, నెలకు రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు భారీ వేతనాలు తీసుకునే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల పేరిట కూడా తెల్ల రేషన్ కార్డులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయి ప్రత్యేకంగా కొత్త కార్డులు మంజూరు చేయించుకున్న వారిలో ఈ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అధికంగా ఉన్నారు. ఇన్నాళ్లూ వీరంతా తమ తల్లిదండ్రుల రేషన్‌కార్డుల్లో సభ్యులుగా కొనసాగడం వల్ల వీరి అసలు వివరాలు, ఆదాయం బహిర్గతం కాలేదు. ప్రస్తుతం డేటా విశ్లేషణ ద్వారా వీరి గుట్టు రట్టవడంతో అలాంటి వారి కార్డులను అధికారులు తొలగిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన తాజా నిబంధనల ప్రకారం.. లబ్ధిదారుల వార్షిక ఆదాయం రూ. 6 లక్షల కంటే ఎక్కువగా ఉండి, ఆదాయ పన్ను చెల్లిస్తున్న వారి కార్డులను తక్షణమే రద్దు చేస్తున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో 3.20 ఎకరాల కంటే ఎక్కువ తరి భూమి లేదా 7.20 ఎకరాల కంటే ఎక్కువ కుష్కి భూమి ఉన్న వారి రేషన్ కార్డులను కూడా ఏరివేస్తున్నారు. ప్రభుత్వ విచారణతో ఇన్నాళ్లూ లబ్ధి పొందిన అనర్హులైన కార్డుదారుల్లో ప్రస్తుతం తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. అనర్హుల ఏరివేత ప్రక్రియలో నిజమైన పేదలకు, అర్హులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం పంపిన లబ్ధిదారుల ప్రాథమిక జాబితాలో సాంకేతిక పొరపాట్ల వల్ల కొందరు అర్హుల పేర్లు కూడా నమోదయ్యాయి. వార్షిక ఆదాయం రూ. 6 లక్షలుగా తప్పుగా చూపిస్తున్న వారి వివరాలను అధికారులు క్షేత్రస్థాయిలో పునఃపరిశీలిస్తున్నారు. మరికొందరు లబ్ధిదారులు బ్యాంకుల నుంచి వ్యాపార, వ్యక్తిగత రుణాలు పొందటం కోసం ఐటీ రిటర్న్స్‌లో లేని ఆదాయాన్ని ఉన్నట్లుగా చూపించినట్లు విచారణలో వెల్లడైంది. ఇలాంటి వారికి అధికారులు నేరుగా ఫోన్ చేసి వివరాలు సేకరిస్తున్నారు. లబ్ధిదారులు చెప్పిన సమాధానాలు,

(మిగతా 2వ పేజీలో)

## పవన్ మార్క్ యాక్షన్ షురూ



రాజమండ్రి మే 26 (వాయిస్‌టుడే) : అనారోగ్యం నుంచి కోలుకున్న తర్వాత ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మళ్లీ యాక్టివ్ అయ్యారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసుకోవడం లేదు, నేతలపై వస్తున్న ఆరోపణలపై రియాక్ట్ కావడం లేదు అంటూ వస్తున్న విమర్శలకు చెక్ పెట్టే ప్రయత్నం గట్టిగానే చేసారు పవన్. అలాగే జనసేన ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కూడా టైం కేటాయిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన లైంగిక దోపిడీ ఆరోపణల వివాదం లో రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ ను తన వద్దకు పిలిపించుకున్న పవన్ కళ్యాణ్ చెడా మడా క్లాస్ పీకారని సమాచారం. శ్రీధర్ తనపై లైంగిక దోపిడీకి పాల్పడ్డారని ఒక మహిళా ఉద్యోగి చేసిన ఆరోపణలు తీవ్ర సంచలనం సృష్టించాయి. ఆమె వరుసగా కొన్ని వీడియోలు రిలీజ్ చేసి పవన్ కళ్యాణ్ తనకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. దీనిపై పవన్ కళ్యాణ్ కూడా ఎందుకు సైలెంట్ గా ఉంటున్నారు అంటూ విపక్షాలు కూడా దాన్ని రాజకీయం చేసే ప్రయత్నం చేసాయి. దీనిపై అన్ని నివేదికలు చెప్పించుకున్న తర్వాత శ్రీధర్ ని పిలిపించుకున్న పవన్ ఆయన వివరణ తీసుకున్నారు. నైతిక పరమైన అంశాల్లో ఇలాంటి ఆరోపణ వస్తే సహించేది లేదంటూ గట్టిగా చెప్పడం తో

(మిగతా 2వ పేజీలో)



### హైదరాబాద్‌పై కేటీఆర్ వ్యూహాత్మక గాలం



### డీకే అరుణకు పార్టీ పగ్గాలు



### ఎన్నాళ్లు పెట్రో మంట



## టీమ్ 2029

### సౌత్ టార్గెట్ గా కేబినెట్ విస్తరణ


న్యూఢిల్లీ, మే 26 ( వాయిస్ టుడే ) : ఢిల్లీ రాజకీయాల్లో ఇప్పుడు ఎక్కడ చూసినా కేంద్ర మంత్రివర్గ విస్తరణ గురించిన చర్చలే నడుస్తున్నాయి. మోదీ 3.0 ప్రభుత్వం కొలువుదీరి దాదాపు రెండేళ్లు కావస్తున్న తరుణంలో, పాలనలో సరికొత్త జోష్ నింపేందుకు ప్రధాని భారీ మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ సారి జరగబోయే విస్తరణలో కేవలం ఎంపీలు మాత్రమే కాదు, ఏకంగా ఇద్దరు ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులకు కూడా చోటు దక్కబోతోందనేది ప్రధానంగా వినిపిస్తున్న గాసిప్. ఈ సారి మంత్రివర్గంలోకి మాజీ ముఖ్యమంత్రులను తీసుకు రావడం ద్వారా అనుభవం అనే కార్డును మోదీ ప్లే చేయబోతున్నారు. ఇప్పటికే శివరాజ్ సింగ్ చౌహాన్, మనోహర్ లాల్ ఖట్టర్ వంటి వారు కేబినెట్‌లో ఉండగా, మరో ఇద్దరు లేదా ముగ్గురు మాజీ సీఎంల పేర్లు ఇప్పుడు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరిని కేబినెట్ స్థాయి హోదాతో కీలక మంత్రిత్వ శాఖలకు అప్పగిస్తారని ప్రచారం జరుగుతోంది. వీరిలో ఇప్పటికే రాజీనామా చేసిన నితీష్ కుమార్ తో పాటు మరో ఇద్దరు ముగ్గురు ముఖ్యమంత్రుల్ని మార్చి మరీ కేంద్రానికి తీసుకువస్తారని అంటున్నారు. 2026 మే నెలలో జరగబోయే ఈ మార్పులను రాజకీయ వర్గాలు 'మిడ్-టర్మ్ రీసెట్'గా అభివర్ణిస్తున్నాయి. పనితీరు సరిగా లేని మంత్రులను సాగనంపి,

(మిగతా 2వ పేజీలో)

## చీలిక దిశగా టీఎంసీ

### పార్లమెంట్ లో బీజేపీ పక్షంలో విలీనం

కోల్ కత్తా మే 26 : బెంగాల్ శాసనసభ ఎన్నికలు 2026లో తృణమూల్ కాంగ్రెస్ ఘోర పరాజయం ఆ పార్టీ పునాదులను కదిలిస్తోంది. సుమారు 15 ఏళ్ల అధికారానికి తెరపడుతూ బీజేపీ ఘనవిజయం సాధించడంతో, ఇప్పుడు టీఎంసీ అంతర్గత సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ క్రమంలో లోక్‌సభలో ఆ పార్టీకి ఉన్న బలం కూడా సడలిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. దాదాపు 12 మంది లోక్‌సభ ఎంపీలు ఇప్పటికే బీజేపీతో టచ్‌లోకి వెళ్లినట్లు బెంగాల్‌లో రాజకీయవర్గాలు అంచనాకు వచ్చాయి. టీఎంసీకి చెందిన 29 మంది లోక్‌సభ సభ్యుల్లో దాదాపు 12 మంది ఎంపీలు ఇప్పటికే కమలం గూటికి చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. మరో ఐదారుగురు ఎంపీలతో కూడా చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. మొత్తం మీద 19 నుంచి 20 మంది ఎంపీలను ఒకే తాటిపైకి తెచ్చి, ఫిరాయింపుల నిరోధక చట్టం నుంచి రక్షణ పొందేలా ఒక పక్కా వ్యూహం అమలవుతోందని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మూడింట రెండు వంతుల మంది పార్టీ మారిపోతే దాన్ని విలీనం కేటగిరీలో చేర్చడం ద్వారా అనర్హతా వేటును తప్పించుకోవచ్చు. 20 మంది ఎంపీలు పార్టీ మారితే సరిపోతుంది. ఈ పరిణామం మమతా బెనర్జీకి , అభిషేక్ బెనర్జీకి పెద్ద ఎదురుదెబ్బగా పరిణమించనుంది. మరీ ముఖ్యంగా మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితులుగా భావించే కొందరు నేతలు కూడా ఈ జాబితాలో ఉండటం చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీలో నాయకత్వంపై అసంతృప్తి పెరగడం, భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్న నేతలు ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నట్లు భావిస్తున్నారు. మరోవైపు, పార్టీని కాపాడుకోవడానికి టీఎంసీ నాయకత్వం ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ చెల్లాచెదురవ్వడం , సీనియర్ నేతల అసమ్మతి ఆ పార్టీని మరింత బలహీనపరుస్తోంది. ఒకవేళ ఈ ఎంపీల వలసలు నిజమైతే, జాతీయ స్థాయిలో తృణమూల్ కాంగ్రెస్ ప్రాభవం గణనీయంగా తగ్గిపోవడమే కాకుండా, పార్లమెంటులో కూడా ఆ పార్టీ



బలం నామమాత్రంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. రాజ్యసభ ఎంపీలూ ఫిరాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం రాజ్యసభలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి 13 మంది సభ్యులు ఉన్నారు. 2026 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలయ్యాక, లోక్‌సభ ఎంపీలతో పాటు రాజ్యసభ సభ్యులు కూడా బీజేపీ వైపు చూస్తున్నారనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. తాజా రాజకీయ పరిణామాల ప్రకారం, సుమారు 8 మంది రాజ్యసభ ఎంపీలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఉన్నట్లుగా చెబుతున్నారు. లోక్‌సభలో ఇప్పటికే మెజారిటీ ఎంపీలు చేజారిపోయే స్థితిలో ఉండటంతో, రాజ్యసభలో కూడా ఇదే విధమైన తిరుగుబాటు జరిగితే పార్లమెంటులో టీఎంసీ ఉనికి ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా జూన్ మొదటి వారంలో ఈ వలసలు ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రాబోయే రోజుల్లో బెంగాల్ రాజకీయాల్లో మరిన్ని కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా బీజేపీ బాట పట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ రాజకీయ అనిశ్చితి మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్‌కు అగ్నిపరీక్షగా మారింది.



## వర్కింగ్ ఉమెన్ భద్రత సంరక్షణ ప్రభుత్వ బాధ్యత: మంత్రి సీతక్క

### బంజారాహిల్స్‌లో వర్కింగ్ ఉమెన్ హాస్టల్, సఖి కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క

మహిళా వారోత్సవాల్లో భాగంగా హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నెంబర్-12లో నిర్మించిన వర్కింగ్ ఉమెన్ హాస్టల్ "సఖి నివాస్", వన్ స్టాప్ సెంటర్ "సఖి కేంద్రం"ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, చైల్డ్ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, చైల్డ్స్ రైట్స్ కమిషన్ సభ్యులు బండి అపర్ణ, వందన గౌడ్ మరిపల్లి చందన, సరిత, ప్రేమ్ లత అగర్వాల్, ఉమెన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం హైదరాబాద్‌కు వచ్చే మహిళలకు సురక్షిత వసతి కల్పించేందుకు ప్రభుత్వం వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ హాస్టల్‌లో సుమారు 150 మంది మహిళలకు

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ ఆఫ్ ప్రజలు

బుధవారం, మే 27, 2026

# హైదరాబాద్‌పై కేటీఆర్ వ్యూహాత్మక గాలం



హైదరాబాద్, మే 26 ( వాయిస్ టుడే ) తెలంగాణలో అధికారాన్ని కోల్పోయిన తర్వాత గులాబీ పార్టీ తన తదుపరి ప్రధాన లక్ష్యంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై గురిపెట్టింది. కూకట్‌పల్లిలో జరిగిన పార్టీ శ్రేణుల విస్తృత స్థాయి సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు, ప్రకటించిన హామీలు పూర్తిగా గ్రేటర్ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా సాగాయి. గత ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు తమకు అందించిన తిరుగులేని మద్దతును కాపాడుకుంటూనే, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం ద్వారా నగరంలో పట్టు బిగించాలని బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. హైదరాబాద్ నగర అభివృద్ధిలో మౌలిక వసతుల కల్పన అత్యంత కీలకం. గత బీఆర్ఎస్ పాలనలో నగరానికి 24 గంటల నిరంతర విద్యుత్ అందించామని గుర్తుచేసిన కేటీఆర్, రాబోయే రోజుల్లో తాము మళ్లీ అధికారంలోకి వస్తే నగరంలోని ప్రతి ఇంటికి 24 గంటల పాటు నిరంతర తాగునీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. మిషన్ భగీరథ ద్వారా ఇప్పటికే ఇంటింటికీ పైప్‌లైన్ కనెక్షన్లు ఇచ్చామని, 24 గంటల నీటి సరఫరా బాధ్యతను స్వయంగా తానే భుజాన వేసుకుంటానని ప్రకటించడం ద్వారా నగర ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన నాటి కరెంటు కోతలు, నీటి కొరతలను ప్రజలకు గుర్తు చేస్తూ నాటికీ, నేటికీ ఉన్న వ్యత్యాసాన్ని విశ్లేషించారు. గడిచిన రెండున్నర ఏళ్ల కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ నగరానికి ఒక్క రూపాయి కూడా అదనంగా ఖర్చు చేయలేదని కేటీఆర్ దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అసమర్థ ప్రభుత్వంగా అభివర్ణిస్తూ తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ఫ్లైఓవర్లు, టిమ్స్ ఆసుపత్రుల రిబ్బన్లు కట్ చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తున్నారని ఆరోపించారు. గడిచిన రెండున్నర సంవత్సరాలలో హైదరాబాద్ లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క డబుల్ బెడ్రూమ్ ఇల్లు కూడా నిర్మించలేదన్నారు. ఒకవేళ ఒక్క ఇల్లయినా నిర్మించినట్లు నిరూపిస్తే నేను రాజకీయ సన్యాసం చేస్తానని కేటీఆర్ సవాల్ విసిరారు. మహిళలకు 2500 రూపాయల సాయం, పెన్షన్ల పెంపు వంటి అడ్డగోలు హామీలతో కాంగ్రెస్ ప్రతి వర్గాన్ని మోసం చేసిందని, అందుకే అవగాహన ఉన్న హైదరాబాద్ ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు. హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటి రియల్ ఎస్టేట్ రంగం కాంగ్రెస్ పాలన వల్ల పూర్తిగా దెబ్బతిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల ఉపాధి కోల్పోయిన లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు, సెంట్రింగ్ కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రాగానే ఈ కార్మికుల కోసం ప్రత్యేక బీమా సౌకర్యంతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని ప్రకటించడం ద్వారా నగరంలోని వలస, కార్మిక ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకునే వ్యూహాన్ని అమలు చేశారు. గత పదేళ్లలో అభివృద్ధిపైనే పూర్తి ఫోకస్ పెట్టామని, ఈసారి అధికారంలోకి వస్తే కష్టపడిన కార్యకర్తలకు, నేతలకు పూర్తి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు

# ఎన్నాళ్లు పెట్రో మంట...



ముంబై మే 26 : పెంచుడు కార్యక్రమం దర్జాగా సాగిపోతోంది. జనాలకు కూడా అలవాటైపోతుంది. మొదట్లో మూడు రూపాయలు పెంచారు. ఆ తర్వాత 90 పైసలు వడ్డించారు. ఇప్పుడు ఏకంగా 2.84 రూపాయలు పెంచేశారు. ఇలా పెంచుకుంటూ పోవడం వల్ల సామాన్య జనం బతికే పరిస్థితి లేకుండా పోతోంది. ధరల స్థాయి నిరంతర పెరుగుతున్న నేపథ్యంలో మార్కెట్లో ప్రతి వస్తువు ధర కూడా ఆకాశంలో విహరిస్తోంది. పెట్రోల్ ధరల పెరుగుదలను సాకుగా చూపించి వ్యాపారులు ఇతర వస్తువుల ధరలు కూడా పెంచుతున్నారు. దీనివల్ల సగటు మనిషి బతకలేక పోతున్నాడు. సోమవారం ఉదయం నుంచి మన దేశంలో డీజిల్, పెట్రోల్ ధరలు మరింత పెరిగాయి. పెట్రోల్ పై 2.84.. డీజిల్ పై 2.86 రూపాయల ధర పెరిగింది. నష్టాలు వస్తున్నాయని సాకుగా చూపించిన దేశీయ చమురు రంగ సంస్థలు ధరలను విపరీతంగా పెంచాయి. ఈ ధరలు సోమారం ఉదయం నుంచి అమలులోకి వచ్చాయి. ఇప్పటికే మూడు విడతలుగా డీజిల్, పెట్రోల్ ధరలను చమురు రంగ సంస్థలు పెంచేశాయి.. ఇప్పుడు పెరిగిన దర ప్రకారం ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర 102.12, లీటర్ డీజిల్ ధర 95.20కి విక్రయిస్తున్నారు.. ముంబైలో లీటర్ పెట్రోల్ ధర 111.12, చెన్నైలో 107.77, విజయవాడలో 117.19, డీజిల్ 104.88, గుంటూరులో పెట్రోల్ 117.59, డీజిల్ 105.28, హైదరాబాదులో పెట్రోల్ 115.58, డీజిల్ 103.74 ధరలో లభ్యమవుతూ ఉంటుంది. మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో యుద్ధం తగ్గినప్పటికీ.. ఉద్రిక్తతలు ఒకప్పటి మాదిరిగా లేకపోయినప్పటికీ.. చమురు సరఫరాలో ఊహించిన వేగం లేదు. పైగా అంతర్జాతీయంగా బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. గల్ఫ్ దేశాలు యుద్ధం వల్ల ఏర్పడిన లాస్ ను పూడ్చుకోవడానికి క్రూడ్ ఆయిల్ ధరలను పెంచేస్తున్నాయి. దీనివల్ల అన్ని దేశాలలో చమురు ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. కొన్ని దేశాలైతే చమురు వినియోగంలో అనేక షరతులు విధిస్తున్నాయి. ప్రజలను ఇష్టానుసారంగా వాడకూడదని సూచిస్తున్నాయి. దీంతో అన్ని రకాల సేవలు తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా అన్ని వ్యాపారాలు చమురు ఆధారంగా సాగుతూ ఉంటాయి. చమురు ధరలు పెరిగితే చాలు ఇతర వస్తువుల ధరలు కూడా పెరిగిపోతుంటాయి. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఇతర వస్తువుల ధరలు కూడా పెరిగిపోతున్నాయి. దీంతో సగటు జీవి బడ్జెట్ లెక్కలు మారిపోతున్నాయి. అందువల్లే యుద్ధం శాశ్వతంగా ముగిసి.. చమురు ధరలు సాధారణ స్థితికి రావాలని ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు కోరుకుంటున్నారు. అయితే శాంతి చర్చల నేపథ్యంలో అటు ఇరాన్.. ఇటు అమెరికా పట్టు విడుపులకు పోతున్న నేపథ్యంలో పరిస్థితి ఎప్పుడు మునుపటి స్థితికి వస్తుందో అర్థం కావడం లేదు.

# డీకే అరుణకు పార్టీ పగ్గాలు..



మహబూబ్ నగర్, మే 26, ( వాయిస్‌టుడే) : తెలంగాణాలో అధికారంలోకి రావాలని బీజేపీ భావిస్తోంది. 2028 ఎన్నికల్లో గెలిచి తీరాలని పట్టుదలగా ఉంది దాంతో సామాజిక రాజకీయ వ్యూహాలను అమలు చేస్తోంది. రెడ్డి జనాభా అధికంగా ఉన్న తెలంగాణా రాజకీయంగా వారి ప్రభావాన్ని గమనించి ఆ దిశగా వేగంగా పావులు కదుపుతోంది. కేంద్ర మంత్రి వర్గ విస్తరణతో పాటే తెలంగాణలో కొత్త బీజేపీ అధ్యక్షుడిని కూడా నియమించాలని చూస్తోంది. ప్రస్తుతం తెలంగాణా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న రామచంద్రరావుని తప్పిస్తారని అంటున్నారు. దీంతో భారీ మార్పులకే బీజేపీ శ్రీకారం చుడుతోంది అని అంటున్నారు కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణా నుంచి ఇద్దరు మంత్రులు ఉన్నారు. వారిలో ఒకరు బండి సంజయ్, ఆయన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పనిచేస్తున్నారు. మరొకరు కేబినెట్ ర్యాంక్ మంత్రిగా ఉన్నారు. ఆయనే కిషన్ రెడ్డి. అయితే ఇందులో బండిని తప్పిస్తారు అన్న ప్రచారం అయితే ఊపందుకుంది. ఆయన ప్లేస్ లో కొత్తగా ఒకరిని తీసుకోవాలని చూస్తున్నారు. నిజామాబాద్ కి చెందిన ధర్మపురి అరవింద్ కి కేంద్ర మంత్రిగా చాన్స్ దక్కుతుందని అంటున్నారు. బండి సామాజిక వర్గానికి చెందిన వారితోనే ఆ పోస్టుని భర్తీ చేయడం ద్వారా ఆ సామాజిక వర్గానికి న్యాయం చేసినట్లు అవుతుందని లెక్క వేస్తున్నారుట. ఇక బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరి ఒకసారి ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి మరోసారి మల్కాజ్ గిరీ నుంచి ఏకంగా ఎంపీగా గెలిచిన ఈటెలకు తెలంగాణా రాజకీయాల్లో పాతికేళ్ళకు పైగా అనుభవం ఉంది. కేసీఆర్ మంత్రివర్గంలో ఆయన కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహించారు. అలాంటి ఆయనకు బీజేపీలో అయితే పెద్దగా పదవులు దక్కింది లేదు. రాష్ట్ర పగ్గాలు ఇస్తారనుకుంటే అదీ లేదు. దాంతో ఆయన వర్గం ఒకింత అసంతృప్తిగా ఉందని అంటున్నారు. దాంతో ఈటెలకు మంత్రి పదవి ఇస్తారు అని అంటున్నారు. త ద్వారా బీజేపీలోకి వచ్చిన వారికి పార్టీ సమాదరిస్తుంది అన్న సందేశాన్ని పంపిస్తారు అని అంటున్నారు. ఇక కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి విషయంలో కూడా కీలక నిర్ణయం తీసుకోబోతున్నారు అని అంటున్నారు. ఆయన శాఖను మారుస్తారు అని అంటున్నారు. కేబినెట్ ర్యాంక్ తో ఆయనకు మరో ముఖ్య శాఖను అప్పగిస్తారు అని అంటున్నారు ఇక కేంద్ర మంత్రి పదవి కోసం పోటీ పడుతున్న మహబూబ్ నగర్ ఎంపీ సీనియర్ నాయకురాలు అయిన డీకే అరుణకు కూడా సమ ప్రాధాన్యత ఇస్తారని అంటున్నారు. ఆమెని తెలంగాణా బీజేపీ ప్రెసిడెంట్ గా తీసుకుంటారు అని అంటున్నారు. తద్వారా ఆమె దూకుడు రాజకీయంతో పార్టీని మరింతగా బలోపేతం చేసుకోవచ్చు అన్నది కమలనాథుల ఆలోచనగా చెబుతున్నారు ఇక డీకే అరుణ చూస్తే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన వారు. రేవంత్ రెడ్డి సొంత జిల్లాకు చెందిన ఆమె ఢీ అంటే ఢీ అంటూ రేవంత్ రెడ్డితో ఇప్పటికే పోటీ పడుతున్నారు. ఆమెకు కనుక కీలకమైన తెలంగాణా బీజేపీ అధ్యక్ష పీఠం అప్పగిస్తే పార్టీ పరుగులు తీస్తుందని రేవంత్ రెడ్డి కి సరైన ప్రత్యర్థిని ఎంపిక చేసినట్లు అవుతుందని బలమైన రెడ్డి సామాజిక వర్గాన్ని కూడా తమ వైపునకు తిప్పుకున్నట్లు అవుతుందని అంటున్నారు. మొత్తానికి తెలంగాణాలో బీజేపీ ప్రక్షాళనకు కేంద్ర పెద్దలు నిర్ణయించారు అని అంటున్నారు ఈ మేరకు రాష్ట్ర పార్టీ నేతలను పిలిపించుకుని మరీ చర్చిస్తున్నారు అని అంటున్నారు.

# ఐపీఎల్-2026 ఫైనల్లోకి దూసుకెళ్లిన ఆర్సీబీ... గుజరాత్‌కు మరో చాన్స్

**క్వాలిఫయర్-1లో గుజరాత్‌పై ఆర్సీబీ 92 పరుగుల భారీ విజయం**

**ఐపీఎల్ 2026 ఫైనల్‌కు నేరుగా అర్హత సాధించిన బెంగళూరు**

**33 బంతుల్లో 93 పరుగులు చేసి కెప్టెన్ రజత్ పటీదార్ విధ్వంసం**




డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఐపీఎల్ 2026 సీజన్‌లో నేరుగా ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన క్వాలిఫయర్-1 మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌ను 92 పరుగుల భారీ తేడాతో చిత్తుగా ఓడించి టైటిల్ సమరానికి సిద్ధమైంది. కెప్టెన్ రజత్ పటీదార్ ఆడిన విధ్వంసకర ఇన్నింగ్స్ ఆర్సీబీ విజయంలో కీలకపాత్ర పోషించింది. మరోవైపు, ఈ మ్యాచ్‌లో ఓటమి పాలైనప్పటికీ గుజరాత్ టైటాన్స్‌కు ఫైనల్ చేరేందుకు మరో అవకాశం మిగిలి ఉంది. ఎలిమినేటర్ మ్యాచ్ విజేతతో ఆ జట్టు క్వాలిఫయర్-2లో తలపడనుంది. ధర్మశాల వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్ బౌలింగ్ ఎంచుకోగా, ఆర్సీబీ బ్యాటర్లు పరుగుల వరద పారించారు. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 254 పరుగుల భారీ స్కోరు సాధించారు. వెంకటేశ్ అయ్యర్ (19) మెరుపు ఆరంభాన్ని ఇవ్వగా, విరాట్ కోహ్లీ (43), దేవదత్ పడిక్కల్ (30) కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే వీరిద్దరిని ఒకే ఓవర్లో పెవిలియన్ చేర్చి హోల్డర్ గుజరాత్‌కు కాస్త ఊరటనిచ్చాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రజత్ పాటిదార్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 33 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్సర్లతో అజేయంగా 93 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. కృనాల్ పాండ్య (43) కూడా రాణించడంతో ఆర్సీబీ భారీ స్కోరు చేసింది. అనంతరం 255 పరుగుల కొండంత లక్ష్య ఛేదనలో గుజరాత్ టైటాన్స్ ఆరంభంలోనే తడబడింది. సాయి సుదర్శన్ (14), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (2) త్వరగా ఔటయ్యారు. జోస్ బట్లర్ (29) వేగంగా ఆడే ప్రయత్నం చేసినా ఎక్కువసేపు నిలవలేదు. ఒక దశలో 51 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి గుజరాత్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ సమయంలో రాహుల్ తెవాటియా (68) ఒంటరి పోరాటం చేశాడు. 43 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో గుజరాత్ పరువు నిలిపే ప్రయత్నం చేశాడు. కానీ అతనికి ఇతర బ్యాటర్ల నుంచి సహకారం అందలేదు. ఆర్సీబీ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో గుజరాత్ 19.3 ఓవర్లలో 162 పరుగులకే ఆలౌట్ అయింది. ఆర్సీబీ బౌలర్లలో జాకబ్ డఫీ 3 వికెట్లు పడగొట్టగా.. భువనేశ్వర్ కుమార్, కృనాల్ పాండ్య, రసిఖ్ సలామ్ దార్ తలా రెండు వికెట్లు తీశారు. రేపు (మే 27) సన్ రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరగనుంది. ఇందులో గెలిచిన జట్టుతో మే 29న క్వాలిఫయర్-2లో గుజరాత్ టైటాన్స్ తలపడనుంది. ఈ మ్యాచ్ లో గెలిచిన జట్టు ఫైనల్ చేరుతుంది.

# వర్కింగ్ ఉమెన్ భద్రత సంరక్షణ ప్రభుత్వ బాధ్యత: మంత్రి సీతక్క

వసతి సౌకర్యం కల్పించామని తెలిపారు. చిన్న పిల్లలతో వచ్చే తల్లులు కూడా ఇక్కడే బస చేసే విధంగా ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహిళల భద్రత, గౌరవం, ఆత్మవిశ్వాసం, ఆర్థిక స్వావలంబన కోసం తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. మహిళలు ఎదుగుతుంటే కొందరు సహించలేక విమర్శలు చేస్తున్నారని, కానీ మహిళల శక్తి ముందు అలాంటి విమర్శలు నిలవవని అన్నారు. మహిళా అభ్యున్నతిని ఓర్చుకోలేని విపక్షాలకు మహిళలే తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు.

రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ఐదు లక్షల నుంచి పది లక్షల రూపాయల వరకు వడ్డీ లేని రుణాల పరిమితిని పెంచిందని తెలిపారు. మహిళా సంఘాలకు రైస్ మిల్లులు, పెట్రోల్ బంకులు, మహిళా సూపర్ మార్కెట్లు వంటి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఒకప్పుడు ఖర్చులకోసం కోసం ఇతరులను ఆశ్రయించే స్థితి నుంచి.. ఇంటి ఖర్చులు భరించే స్థాయికి, పిల్లల చదువు బాధ్యతలు చూసుకునే స్థాయికి, నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి మహిళలను తీసుకెళ్తున్నామని అన్నారు.

సంపద సృష్టించే శక్తిగా మహిళలను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. మహిళల ఆదాయం పెరిగితే కుటుంబం బలపడుతుందని, రాష్ట్రం సంపన్నమవుతుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో మహిళ ఎదగాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు.

మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ విద్యుత్ ప్లాంట్లను బుధవారం నాడు ప్రారంభించనున్నామని, మధిర నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్రారంభిస్తామని జూన్ 5న మహిళలకు ఆర్టీసీ బస్సులను సీఎం రేవంత్ రెడ్డి అందజేస్తారని మంత్రి సీతక్క వెల్లడించారు. మహిళా ఉన్నతే తెలంగాణ ప్రగతి అని, గ్రామ గ్రామాన మహిళలు సాధిస్తున్న విజయాలను సమాజానికి చాటి చెప్పాలని పిలుపునిచ్చారు.

# పవన్ మార్క్ యాక్షన్ షురూ

శ్రీధర్ తన విప్ పదవికి రాజీనామా చేశారు ఇక పోలవరం ఎమ్మెల్యే బాలరాజు సైతం ఆ మధ్య చంద్రబాబు పై కొన్ని వ్యాఖ్యలు చేశారు. దీనిపై కూడా సీరియస్ అయిన పవన్ కళ్యాణ్ తన ఆఫీస్ లో బాలరాజు కి క్లాస్ పీకారు. కూటమి ప్రతిష్టను దెబ్బతీసే ఎలాంటి వ్యాఖ్యలు బహిరంగంగా చేయొద్దు అంటూ ఏవైనా విషయాలు ఉంటే పార్టీలోనే చర్చించాలి తప్ప లేనిపోని వివాదాలు సృష్టించొద్దని గట్టిగా చెప్పారు. చిర్రి బాలరాజు పై వస్తున్న ఆరోపణలకు నాలుగు వారాల్లో సమాధానం చెప్పాలంటూ టైం ఇచ్చారు. గోదావరి జిల్లాలో వరుస పర్యటనలు మొదలుపెట్టారు పవన్. గోదావరి ప్రాంతంలో పవన్ కళ్యాణ్ కు జనసేనకు ఉన్న పట్టు చాలా ముఖ్యమైనది. స్థానికంగా ఉన్న నాయకుల్లోనూ కార్యకర్తల్లోనూ జోష్ నింపడానికి పవన్ ఈ పర్యటన ఉపయోగించుకోబోతున్నారు. అలాగే పుష్కరాల పనులు నేపథ్యంలో రాజమండ్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్వయంగా పరీక్షిస్తున్నారు. గత ఎన్నికల్లో కేవలం 24 సీట్లు పోటీ చేసిన జనసేనను రాబోయే ఎన్నికల్లో మరిన్ని ఎక్కువ సీట్లు కు పెంచేలా వ్యూహం అయితే రెడీ చేస్తున్నారు జనసేనాని. వచ్చే ఎన్నికల్లోనూ కూటమి కలిసే పోటీ చేస్తుంది అని ఇప్పటికే పలుమార్లు హింట్ ఇచ్చారు పవన్. అయితే దీనిపై జనసేన క్షేత్రస్థాయి అభిమానుల్లో అసంతృప్తి ఉన్నమాట వాస్తవం అని పవన్ వరకూ నివేదికలు వెళ్లాయి. వాటిని దృష్టిలో పెట్టుకునే యువకులను, తనకున్న అభిమానులను, గ్రౌండ్ లెవెల్ కార్యకర్తలను సంతృప్తిపరిచేలా పవన్ కళ్యాణ్ తన పర్యటనలు రెడీ చేస్తున్నారు. అందుకే ఒకవైపు ఇలాంటి టూర్స్ వేస్తూనే మరోవైపు పార్టీలో ఆరోపణలు, వివాదాలు ఎదుర్కొంటున్న నాయకులకు క్లాసులు పీకుతూ పార్టీని రిపేర్ చేసే పనిలో పడ్డారు జనసేనాని. విపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వాన్ని కామెంట్ చేయడం ఈజీయే కానీ ఎంత వద్దన్నా అధికారంలో ఉన్నప్పుడు ప్రజల్లో ఎంతో కొంత అసంతృప్తి అయితే ఉంటుంది. అందుకే కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని పవన్ తన పార్టీపై ప్రజల్లో భరోసా కల్పించే ప్రయత్నంలో పడ్డారని విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు.

# తెలంగాణలో రేషన్ కార్డుల ఏరివేత

వారు సమర్పించిన పత్రాలపై విచారణ అధికారి సంతృప్తి చెందితే వారి కార్డులను యథావిధిగా కొనసాగిస్తున్నారు. అనుమానాస్పద కార్డుల విషయంలో అధికారులు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారు చెప్పిన సమాచారం వాస్తవమా కాదా అనే అంశాన్ని అన్ని కోణాల్లో ఆరా తీస్తూ నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

# టీమ్ 2029

వచ్చే సాధారణ ఎన్నికల నాటికి పార్టీని, ప్రభుత్వాన్ని బలోపేతం చేసే దిశగా కొత్త ముఖాలను ప్రవేశపెట్టబోతున్నారట. కేవలం సీనియర్లే కాకుండా, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బాగా పనిచేసిన యువ నేతలకు, అలాగే రాబోయే అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు చెందిన నేతలకు ఈసారి పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యాన్ని పెంచడం ద్వారా 2029 ఎన్నికల లక్ష్యంగా అడుగులు వేయాలని బీజేపీ హైకమాండ్ భావిస్తోంది. ప్రస్తుతం కొందరు మంత్రులు రెండు మూడు శాఖలను నిర్వహిస్తున్నారు. ఈ అదనపు బాధ్యతలను తగ్గించి, ప్రత్యేకంగా ఒక్కో శాఖకు ఒక్కో మంత్రిని కేటాయించేలా ప్లాన్ చేస్తున్నారు. రక్షణ, హోమ్, ఆర్థిక వంటి కీలక శాఖల్లో మార్పులు ఉండకపోవచ్చని చెబుతున్నప్పటికీ, రైల్వే, ఐటీ, పౌర విమానయాన వంటి శాఖల్లో కొత్త వారు వచ్చే అవకాశం ఉందని గాసిప్స్ వినిపిస్తున్నాయి. మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జూన్ 10 లోపునే విస్తరణ ప్రక్రియ ముగించాలని చూస్తున్నారట. ఎవరెవరికి బెర్తులు దక్కుతాయి? ఎవరికి ఉద్వాసన పలుకుతారు? అనే ఉత్కంఠ ఇప్పుడు ఎంపీల్లో నెలకొంది. ఈసారి విస్తరణలో సర్‌ప్రైజ్ ఎలిమెంట్స్ ఖచ్చితంగా ఉంటాయని, ఊహించని పేర్లు తెరపైకి వస్తాయని ఎక్కువ మంది నమ్ముతున్నారు.

## డ్రైవర్‌పై వేటు వెనక్కి..

## విధుల్లో కొనసాగించాలని మంత్రి పొన్నం ఆదేశం



కాంగ్రెస్ నేతల నిరసనపై విమర్శలు చేశాడన్న ఆరోపణలతో ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌ను తొలగించడంపై చెలరేగిన వివాదానికి తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెరదించారు. డ్రైవర్ అశోక్‌పై తీసుకున్న చర్యను వెనక్కి తీసుకోవాలని, అతడిని విధుల్లో కొనసాగించాలని యాజమాన్యానికి సూచించినట్టు ఆయన మంగళవారం తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. “డ్రైవర్ అశోక్ ఆర్టీసీ ఉద్యోగి కాదు, కేవలం అద్దె బస్సు డ్రైవర్ మాత్రమే. అయినప్పటికీ, అతను రైతుల పక్షాన మాట్లాడాడు. దానిని మేము స్వాగతిస్తున్నాం. అందుకే అతడిని ఉద్యోగం నుంచి తొలగించవద్దని బస్సు యాజమాన్యానికి సూచించాం” అని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి అన్ని చర్యలు తీసుకుంటోందని, ఈ విషయాన్ని విపక్షాలు రాజకీయం చేయవద్దని హితవు పలికారు.

# నాలాల అభివృద్ధితో ముంపు తీవ్రత తగ్గింపు, శరవేగంగా నియోజకవర్గ అభివృద్ధి

## బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



కుత్బుల్లాపూర్ మే 26(వాయిస్ టుడే ): 131-కుత్బుల్లాపూర్ డివిజన్ సూర్య నగర్, రామిరెడ్డి నగర్ లలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ గారు పర్యటించి రామ్ రెడ్డి నగర్ నాలా బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా స్టార్మ్ వాటర్ సమస్య, అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనుల సమస్యలను కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.అనంతరం బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల లో కోట్లాది రూపాయల నిధులతో కాలనీల గుండా వెళుతున్న మురుగు కాలువకు దాదాపు అన్ని ప్రాంతాలలో ఇప్పటికే రిటర్నింగ్ వాల్ నిర్మాణం చేపట్టామని, అదేవిధంగా వర్షాకాలంలో కాలనీలలోని ఇళ్లలోకి నీరు చేరకుండా బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టామని అన్నారు.రామ్ రెడ్డి నగర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యి టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందని అతి త్వరలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి తరగతిన పూర్తి చేస్తామని, తద్వారా ఇళ్లలోకి వరద నీరు చేరకుండా ఉంటుందన్నారు.

బ్రిడ్జి నాలా పనులతో పాటు సూర్య నగర్ లో అంతర్గత సిసి రోడ్లు స్టాం వాటర్ పనులను త్వరగతిన చేపట్టి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు స్థానిక హనుమాన్ దేవాలయం, శ్రీ శక్తిగణపతి దేవాలయంలలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ రవి, ఎలక్ట్రికల్ ఏఈ రవీందర్ రెడ్డి, జిహెచ్ఎంసి ఏఈ అభిలాష్, రామ్ రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు యాదవ రెడ్డి, కార్యవర్గ సభ్యులు హీరాలాల్ బాటి, చంద్రశేఖర్ రెడ్డి, సుభాష్ గౌడ్, సురేష్ కుమార్, రాజన్న, సూర్య నగర్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వి. సురేష్, ఉపాధ్యక్షులు రమణయ్య, కుత్బుల్లాపూర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు యాదగిరి బాపూ, వనం శ్రీనివాస్, బొంబాయి శ్రీను, రాకేష్ జలిగం, ఎండి.నజీరుద్దీన్, రమణారెడ్డి, ఆంజనేయులు, అజయ్, వెంకటేష్, సుధాకర్ రెడ్డి, శ్రీనాథ్, జయం చారి తదితరులు పాల్గొన్నారు.

## సూరారం కాలనీలో దాహార్తి తీర్చిన మజ్జిగ పంపిణీ కార్యక్రమం

### -- పర్యావరణ పరిరక్షణపై కోల రవీందర్ ముదిరాజ్ పిలుపు



కుత్బుల్లాపూర్ మే 26(వాయిస్ టుడే): సూరారం కాలనీ లాస్ట్ బస్ స్టాప్, ఎంబి గ్రామర్ స్కూల్, అంబేద్కర్ విగ్రహం వద్ద 60 యార్డ్స్ ప్రాంతాలలో మజ్జిగ ఇవ్వడం జరిగింది ప్లాస్టిక్ గ్లాసులు వాడకుండా పేపర్ గ్లాసుల్లో ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తన ఇంటి ముందర అరుగుపైన గాని ఒక కుర్చీ వేసి గాని బిందెలో గాని కుండలో కానీ దారిన పోయే వారికి నీటిని ఉంచాలని అట్టి బిందె పై చల్లటి తెల్లటి గుడ్డలు కట్టిపెట్టినట్లు అయితే మీరు సల్లగా ఉంటుందని తెలియపరిచినారు ఈరోజుకు నాలుగవ రోజు ఈ కార్యక్రమంలో విక్రమ్ రెడ్డి,వేణు, శివ,కేశవ్,యాదవ్,లాల్ సింగ్ మొదలగు వారు పాల్గొన్నారు.

## నూతన శ్రీ పోచమ్మ ఆలయ కమిటీకి భగత్ సింగ్ స్ట్రీట్ అసోసియేషన్ ఘన సన్మానం



కూకట్‌పల్లి: మే 26(వాయిస్ టుడే): నూతనంగా ఎన్నికైన శ్రీ పోచమ్మ ఆలయ చైర్మన్ రాచమల్ల బిక్షపతి గౌడ్‌తో పాటు కమిటీ సభ్యులను భగత్ సింగ్ స్ట్రీట్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బి-బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, కూకట్‌పల్లి ఓబీసీ సెల్ అధ్యక్షులు తూము సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తూము వేణు మాట్లాడుతూ, అన్ని సామాజిక వర్గాలకు అవకాశం కల్పిస్తూ పాలనా పరంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. గ్రామ దేవాలయ అభివృద్ధికి బస్తీ వాసులు సహకరించాలని కోరారు. తూము సంతోష్ కుమార్ మాట్లాడుతూ, భగత్ సింగ్ బస్తీ వాసులు స్వంత ఖర్చులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని ఆదర్శంగా నిలిచారని, అదే విధంగా దేవాలయ అభివృద్ధికి కూడా అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ స్ట్రీట్ సభ్యులు వడ్ల అశోక్ కుమార్, దాదె వెంకట్, సక్కురు బాబు రావు, కోడిచర్ల అశోక్ కుమార్, కోడిచర్ల గోపాల్, జిల్ల హనుమంత్ రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జిట్టా సునీల్ కుమార్, రాచమల్ల శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి సమస్యలపై జోనల్ కమిషనర్‌తో బండి రమేష్ భేటీ



కూకట్‌పల్లి: మే 26(వాయిస్ టుడే): టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ మంగళవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గ సమస్యలపై, అలాగే బుధవారం నియోజకవర్గంలో ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు పర్యటన నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు బండి రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాలి బాలాజీ, తూము వేణు, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, కొప్పుశెట్టి దినేష్, గంధము రాజు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ ధరల పెంపుపై బీఆర్ఎస్ ధర్నా

### మాదాపూర్‌లో నాయకుల అరెస్ట్



మాదాపూర్ : మే 26(వాయిస్ టుడే) ప్రజలపై పెట్రోల్ భారాన్ని మోపుతున్న ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. పెట్రోల్ ధరల పెంపును నిరసిస్తూ మాదాపూర్ హైటెక్ సిటీ సర్కిల్‌లో బీఆర్ఎస్ మాజీ స్టేట్ యూత్ ప్రధాన కార్యదర్శి రాయల కార్తీక్ (ఆర్‌కే) ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్ఎస్ శ్రేణులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నిరసన చేపడుతున్న రాయల కార్తీక్‌తో పాటు పలువురు నాయకులను, కార్యకర్తలను మాదాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ప్రజల తరఫున గళం విప్పుతుందని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పోరాటాలు ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మరబోయిన రవి యాదవ్, మమత, రామకృష్ణ గౌడ్, శ్రీకాంత్, శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.





## క్రీడలకు యువత ప్రాధాన్యతనివ్వాలి

### మాజీ సైనికుడు, ఎస్ఎస్ఎస్ యువసేన అధ్యక్షుడు సంతోష్ రెడ్డి

నాచారం (వాయిస్ టుడే):యువత మద్యం మత్తు, చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని మాజీ సైనికుడు, ఎస్ఎస్ఎస్ యువసేన అధ్యక్షుడు సంతోష్ రెడ్డి అన్నారు. ప్రజ్ఞ గ్రూప్ సహకారంతో ఎస్ఎస్ఎస్ యువసేన ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు సమ్మర్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ ను నిర్వహించారు. టోర్నమెంట్ లో గెలిచిన జట్టులకు బహుమతులను అందచేశారు. ఈ సందర్భంగా సంతోష్ రెడ్డి మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. టోర్నమెంట్ కు సహకరించి క్రీడాకారులను ప్రోత్సహించిన నాచారం పోలీస్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత ఆరు సంవత్సరాలుగా సమ్మర్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు.టోర్నమెంట్ కు సహకరించిన కోచ్ లకు, క్రీడాకారులకు, వాలంటరీలకు సంతోష్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.



## సిరిసిల్ల మరియు వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాల కార్యకర్తల ముఖ్య సమావేశం

### ముఖ్య అతిథిగా పాల్గొన్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ మే 26(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమింపబడిన నేపథ్యంలో ఈరోజు సిరిసిల్ల మరియు వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్య నాయకులు సన్నాహక సమావేశాన్ని సిరిసిల్ల డీసీసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ సిరిసిల్ల మరియు వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన అంశాలకు సంబంధించి స్థానిక నాయకులకు పలు సలహాలు సూచనలు తెలియజేయడంతో పాటు గ్రామ కమిటీలు మరియు మండల కమిటీలు బలోపేతం చేయాలని అదేవిధంగా కేంద్ర ఎన్నికల సంఘం త్వరలో చేపట్టబోయే సర్ (ఎస్ ఐ ఆర్ ) స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ కార్యక్రమం పై అవగాహన సదస్సు సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్ ఎస్ ఐ ఆర్ కార్యక్రమం పై కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి ఓట్ల తొలగింపు జరగకుండా చూడాలని నకిలీ ఓట్లను తొలగించే విధంగా బూత్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పనిచేయాలని, అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులందరూ ఓటు హక్కును నమోదు చేసుకునే విధంగా కృషి చేయాలని కార్యకర్తలను ఉద్దేశించి తెలియజేశారు..అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ఆరు గ్యారంటీలను ప్రజాక్షేత్రంలోకి బలంగా తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ , సిరిసిల్ల డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ , సిరిసిల్ల కాంగ్రెస్ ఇంచార్జ్ కె.కె మహేందర్ రెడ్డి కోఆర్డినేటర్లు బొమ్మ శ్రీరాం మరియు ఖజా ఫక్రుద్దీన్ మరియు ఇతర కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జోనల్ కమిషనర్ (ఈ ఆర్ ఓ ) ఆధ్వర్యంలో 'ఎస్ ఐ ఆర్ ' పై ఆల్ పార్టీ సమీక్షా సమావేశం

### -- పాల్గొన్న కాంగ్రెస్ ముఖ్య నాయకులు

కుత్బుల్లాపూర్ మే 26(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ఆదేశాల మేరకు, ఈరోజు కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ (ఈ ఆర్ ఓ ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ పార్టీ మీటింగ్ (సర్వపక్ష సమావేశం) లో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు. రాబోయే ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ --- ఎస్ ఐ ఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) కార్యక్రమంపై అవగాహన, అలాగే క్షేత్రస్థాయిలో బి.ఎల్.ఓ (బి ఎల్ ఓ ) మరియు బి.ఎల్.ఏ (బి ఎల్ ఎ ) లు ఏ విధంగా సమన్వయంతో పని చేయాలనే విధానంపై ఈ సమీక్షా సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు మరియు సవరణల ప్రక్రియను పారదర్శకంగా, విజయవంతంగా పూర్తి చేయడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై జోనల్ కమిషనర్ పలు సూచనలు చేశారు.ఈ సమీక్షా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తరఫున కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ముఖ్య నాయకులు మొహమ్మద్ జాకీర్, బేక్ శీను, బైరి ప్రశాంత్, శివ కుమార్ పాల్గొన్నారు.



## స్థానిక సమస్యలపై పాదయాత్ర నిర్వహించిన మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్

కుత్బుల్లాపూర్ మే 26(వాయిస్ టుడే ) జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మంగళవారం రోజు కూన మహాలక్ష్మి నగర్ (సీసీ. రోడ్స్ )యూ జి డి సమస్యలపై డివిజన్ మాజీ లికార్పొరేటర్ కొలుకుల జగన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం తను కృషి చేస్తానని హామీ ఇచ్చారు(. యూ జి డి .సీసీ. రోడ్డ్ ). పనులను అతి త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు ఈ కార్యక్రమంలో మహంకాళి. వెంకటేష్. ఎర్ర లక్ష్మయ్య. దుర్గయ్య.. నరసింహ. దుర్గేష్. బస్తీ వాసులు పాల్గొన్నారు.

# సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ పరం కాకుండా కాపాడుకుందాం: ఎంపీ వద్దిరాజు

హైదరాబాద్, వాయిస్ టుడే : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, మహానేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాయకత్వాన సింగరేణి బొగ్గు గనులు ప్రైవేట్ పరం కాకుండా కాపాడుకుందామని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు.తెలంగాణ కొంగు బంగారమైన సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ వారికి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం గతంలో ప్రయత్నించినప్పుడు కేసీఆర్ ఆదేశాల మేరకు కొత్తగూడెంలో మహాధర్నా నిర్వహించి అడ్డుకున్న సందర్భాన్ని గుర్తు చేశారు.తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) కార్యవర్గ సమావేశం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మంగళవారం జరిగింది.సంఘం గౌరవాధ్యక్షులు,మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యాన ఏర్పాటైన ఈ సమావేశానికి మిరియాల రాజిరెడ్డి అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, బొగ్గు గనుల శాఖ పార్లమెంటరీ శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా ఉన్న తాను సింగరేణి సంస్థను కాపాడేందుకు పోరాడుతానన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు తీవ్ర నష్టాల్లో ఉన్న ఈ సంస్థను బీఆర్ఎస్ అధినేత, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ లాభాల బాట పట్టించారని వివరించారు.సింగరేణి సంస్థ,ఇందులో పని చేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల తనకు సంపూర్ణ అవగాహన ఉందని, సానుకూలంగా పరిష్కరించాల్సిందిగా సంబంధిత శాఖ మంత్రి కిషన్ రెడ్డి,సీఎండీ జ్యోతిబుద్ధ ప్రసాద్ లతో పలుమార్లు మాట్లాడడం జరిగిందని ఎంపీ రవిచంద్ర తెలిపారు.ఈ సంస్థకు 125 ఏళ్ల ఘనమైన చరిత్ర ఉందని,ఇది ప్రైవేట్ పరం కాకుండా కాపాడేందుకు




కేసీఆర్ మార్గనిర్దేశంతో పార్లమెంటులో పోరాడుతానని,ప్రధాని నరేంద్రమోడీతో మాట్లాడుతానని ఎంపీ వద్దిరాజు చెప్పారు.సింగరేణిలో పని చేస్తున్న యువ కార్మికులు సంఘంలో చురుకైన పాత్ర పోషించే విధంగా మరింత ప్రోత్సహిస్తూ,కేసీఆర్ ను ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు మనమందరం అంకితభావంతో ముందుకు సాగుదామని ఎంపీ వద్దిరాజు అన్నారు.ఈ సమావేశంలో మాజీ మంత్రి,ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యే కోవా లక్ష్మీ, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్,పుట్టా మధుకర్,బాల్క సుమన్, దివాకర్ రావు,గండ్ర వెంకటరమణారెడ్డి, రేగా కాంతారావు,బానోతు హరిప్రియ, దుర్గం చిన్నయ్య,దిండిగల రాజేందర్,చిరుమళ్ల రాకేష్,కాపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమరులైన కార్మికులు,ఉద్యమకారులను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు,"జై తెలంగాణ జైజై తెలంగాణ",జై సింగరేణి జైజై సింగరేణి","వర్ధిల్లాలి వర్ధిల్లాలి కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి "అంటూ నినాదాలు చేశారు.



## అమృతనగర్ తండా నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

### ఖైతలాపూర్‌లో ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే మాధవరం

కూకట్‌పల్లి: మే 26(వాయిస్ టుడే): మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఖైతలాపూర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించారు. ముఖ్యంగా అమృతనగర్ తండాకు చెందిన 62 మంది నిరుపేదలకు బుధవారం ఇళ్ల పంపిణీ జరగనున్న నేపథ్యంలో అక్కడి మౌలిక సదుపాయాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ చిత్తారమ్మ బస్తీతో పాటు ఖైతలాపూర్‌లో మొట్టమొదటగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించామని తెలిపారు. గతంలో అమృతనగర్ తండా వాసులకు లాటరీ ద్వారా 67 మందికి ఇళ్లు కేటాయించగా, మిగిలిన 62 మంది నిరుపేదలకు ఖైతలాపూర్‌లో ఇళ్లు కేటాయించినట్లు చెప్పారు. అలాగే స్థానిక ప్రజలకు 10 శాతం ఇళ్ల కేటాయింపు ఉండేలా చూడాలని, విలేకరులకు కూడా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుకు విజ్ఞప్తి చేశారు. ఫతేనగర్‌లో అమృతనగర్ తండా వాసులు ఖాళీ చేసిన భూమిలో తిరిగి వారికే ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, ప్రభుత్వం స్పందించకపోతే సిఎస్ఆర్ నిధులతో తానే నిర్మిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. నిరుపేదల విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని, ప్రజలకు మేలు జరిగే పనుల్లో తాను ఎప్పుడూ ముందుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పగుడాల బాబురావు, పండాల సతీష్ గౌడ్, తూము శ్రావణ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు బిక్షపతి, అంబటి శ్రీనివాస్, ప్రభాకర్ గౌడ్, ఎంఆర్వో స్వామి, ఇంజనీరింగ్, హౌసింగ్, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలి

### ప్రభుత్వ సలహాదారు వీహెచ్‌తో బీసీ నేతల చర్చలు

హైదరాబాద్, మే 26: ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును కాపాడాలని, బీసీ వర్గాలకు న్యాయం జరిగే విధంగా చూడాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ (బీసీ సంక్షేమం, అభివృద్ధి) సలహాదారులు వి.హనుమంతరావుతో గుజ్జ సత్యంతో కూడిన ప్రతినిధి బృందం బీసీ విద్యార్థుల సమస్యలపై చర్చించారు. అనంతరం గుజ్జ సత్యం మాట్లాడుతూ... బీసీ వర్గాల ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 7ను తక్షణమే రద్దు చేయాలని అన్నారు. బీసీ విద్యార్థులకు హాస్టల్ వసతులు, విద్యా సహాయ పథకాలను బలోపేతం చేయాలని కోరారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను మరింత విస్తృతపరచాలని అన్నారు. విద్యా హక్కు, సామాజిక న్యాయ పరిరక్షణను అందించాలని అన్నారు. బీసీల సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్కతో కలిసి చర్చించి పరిష్కారమయ్యేవిధంగా చూస్తానని వి.హనుమంతరావు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. బీసీ సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని వీహెచ్ అన్నారు. కార్యక్రమంలో మట్టా జయంతి గౌడ్, శంకరయ్య, అశోక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

### ఆర్పిఐ (ఏ) జాతీయ కార్యదర్శి పేరం శివ నాగేశ్వరరావు గౌడ్

హైదరాబాద్, మే 26: తెలంగాణలో త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు జరిగే విధంగా ప్రభుత్వం తగుచర్యలు తీసుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) జాతీయ కార్యదర్శి పేరం శివ నాగేశ్వర రావు గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను ఆర్పిఐ(ఏ) ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కుల ప్రకారం తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, గ్రేటర్ పరిధిలో జరగనున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా రిజర్వేషన్లను పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. మహిళల రాజకీయ సాధికారత కోసం 33 శాతం రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేయాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో సామాజిక న్యాయం, సమాన ప్రాతినిధ్యం అత్యంత కీలకమని, బీసీ వర్గాల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్పిఐ(ఏ) నేతలు టి.రాజ్ కుమార్, జగన్, శ్రవణ్ పాల్గొన్నారు.



## ఇండియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ సంగీత బదిలీ

హైదరాబాద్, మే 26: ఇండియన్ బ్యాంక్ బర్కత్ పుర బ్రాంచ్ చీఫ్ మేనేజర్ గా దాదాపు రెండున్నర సంవత్సరాలుగా పనిచేసి బ్యాంక్ అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేసిన జె.సంగీత న్యూ నల్లకుంట బ్రాంచ్ కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బర్కత్ పుర బ్రాంచ్ లో నూతనంగా చీఫ్ మేనేజర్ గా బాధ్యతలు చేపట్టిన ఎం. అశోక్ కుమార్ కు స్వాగతం ఫలికారు. జె.సంగీతకు బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది, బ్యాంక్ వినియోగదారులు ఘనంగా విడ్కోలు పలికారు. సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సికింద్రాబాద్ జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్, బ్యాంక్ సీనియర్ కస్టమర్ ఎన్. శరత్ శ్యామ్ ఆధ్వర్యంలో జె.సంగీతకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. బ్యాంక్ అభివృద్ధి కోసం అమె అందించిన సేవలను పలువురు ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో ఎ.సందీప్, పి.చైతన్య, పి.అభిలాష్, బి.స్వాతి, టి.రెడ్డప్ప రెడ్డి, ఎన్. కోటేశ్వర్ రెడ్డి, ఎన్. శరత్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రపంచశాంతి కోసం యువత ముందుకు రావాలి

హైదరాబాద్,మే 26: ప్రపంచ శాంతి కోసం యువత ముదుకు రావాలని ప్రముఖ సంఘసేవకులు లయన్ గోపిశెట్టి ప్రమోద్ పిలుపునిచ్చారు. హెచ్ డబ్ల్యుపిఎల్ హైదరాబాద్ బ్రాంచ్ మేనేజర్ ఎలిషా మతంగి ఆధ్వర్యంలో హైదరాబాద్ లో '13వ వార్షిక ప్రపంచ శాంతి ప్రకటన స్మారక సభ ఘనంగా నిర్వహించారు. నవభారత్ నిర్మాణ్ సంఘ్ ప్రతినిధి, హెచ్ఎబ్ల్యుపిఎల్ పీస్ అంబాసిడర్ రవికుమార్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ సందర్భంగా శాంతి సందేశాలు, సర్టిఫికెట్స్ను పంపిణి చేశారు. యుద్ధాల నివారణ, ప్రపంచ శాంతి స్థాపన, మంచి సమాజ నిర్మాణం కోసం శాంతి సందేశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచ శాంతి, మానవతా విలువలు, సమాజ సహకారం అవసరాన్ని ప్రతి ఒక్కరు గుర్తించి శాంతి స్థాపన కోసం ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో అమృత్ కుమార్ జైన్, గోపిశెట్టి ప్రమోద్, రోజా రాణి, సుమిత్ర మక్కపాటి, తుమ్మ జనార్ధన్, డాక్టర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజు సన్నిహితులు వేంకు పరామర్శ



బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సన్నిహితులు వేం వాసుదేవ రెడ్డి అనారోగ్యానికి గురై హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లో ఉన్న బ్రినోవా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.విషయం తెలిసిన వెంటనే ఎంపీ రవిచంద్ర సన్నిహితులు కూసం శ్రీనివాసులు తదితరులతో కలిసి వెళ్లి వాసుదేవ రెడ్డిని పరామర్శించి త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు.

## తక్వా & ఇఖ్లాస్‌తో కుర్బానీ - మానవత్వమే

### ఈద్ అల్-అధా సందేశం: మంజుల పత్తిపాటి



మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంజుల పత్తిపాటి మాట్లాడుతూ ఈద్ అల్-అధా పవిత్ర పండుగ కేవలం ఆనందోత్సవం మాత్రమే కాదని, ఇది తక్వా , సబ్ర్ మరియు త్యాగానికి ప్రతీక అని అన్నారు. ఈ పండుగ ద్వారా మనిషి తన అహంకారాన్ని కుర్బానీ చేసి, నఫ్స్ ను నియంత్రించుకోవాలని తెలిపారు. స్వార్థాన్ని విడిచిపెట్టి, ఇఖ్లాస్ తో జీవించే హృదయంలోనే అల్లాహ్ రహ్మత్ ఉంటుందని ఆమె అన్నారు. మనిషిని మతంతో కాకుండా మనసుతో కొలవాలని ఈ పండుగ ప్రపంచానికి సందేశం ఇస్తోందన్నారు. ప్రపంచానికి ఇప్పుడు కావాల్సింది సంపద కాదు, ఇన్సానియత్ అని తెలిపారు.

క్రోధాన్ని రహ్మత్‌గా, ద్వేషాన్ని ముహబ్బత్‌గా, అహంకారాన్ని వినయంగా మార్చడమే నిజమైన ఇబాదత్ అని ఆమె పేర్కొన్నారు. అల్లాహ్ రహ్మత్, బరకత్, సలాం ప్రతి హృదయంలో నూరుగా నిండాలని ఆకాంక్షిస్తూ ఈ పవిత్ర పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

## విజయవాడలో వంగవీటి రంగా భారీ విగ్రహాల ఏర్పాటుకు ఎంపీ వద్దిరాజు తోడ్పాటు



హైదరాబాద్, మే 26 (వాయిస్ టుడే): ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ నగరం నడిబొడ్డున దివంగత నేత లిలివంగవీటి మోహన రంగారావు (రంగా)లిలి భారీ విగ్రహాల ఏర్పాటుకు అవసరమైన బ్లాక్ గ్రానైట్ అందించి పూర్తి సహకారం అందిస్తానని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర హామీ ఇచ్చారు. కాపు జాగృతి అధ్యక్షులు చందు జనార్ధన్ ఆధ్వర్యంలో రాధా--రంగా మిత్రమండలి ప్రతినిధులు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో మంగళవారం ఎంపీ రవిచంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చెన్నుపాటి శ్రీనివాసరావు, చింతల రామారావు (బాబీ), చింతల శ్రీనివాసరావు, సుంకర రవికుమార్ (చంటి), అడబాల సాంబశివరావు, సత్యనారాయణ తదితరులు విజయవాడ నగర కేంద్రంలో దివంగత నేత రంగా రెండు భారీ విగ్రహాల ప్రతిష్ఠాపన కోసం అవసరమైన బ్లాక్ గ్రానైట్ అందించాలని విజ్ఞప్తి చేశారు. వారి అభ్యర్థనపై వెంటనే స్పందించిన ఎంపీ రవిచంద్ర, ఢిల్లీలోని నేషనల్ పోలీస్ మెమోరియల్ నిర్మాణానికి 370 మెట్రిక్ టన్నుల బ్లాక్ గ్రానైట్, అలాగే నేతాజీ సుభాష్ చంద్ర బోస్ స్తతుఎ విగ్రహానికి అవసరమైన గ్రానైట్‌ను ఖమ్మం క్వారీల నుంచే సరఫరా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రంగా విగ్రహాల కోసం ఎంపిక చేసిన నాణ్యమైన గ్రానైట్‌ను అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో పాటు మున్నూరుకాపు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన శీలంశెట్టి వీరభద్రంను రాధా--రంగా మిత్రమండలి ప్రతినిధులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

# కష్టం కార్మికులది - ఫలితం మరొకరిది

## రిటైరైన కార్మికులకు వేతన సవరణ బకాయిలు వెంటనే చెల్లించాలి

## 5 సంవత్సరాల వేతన బకాయిల గురించి ఆ ఉత్తర్వులలో లేకపోవడం అన్యాయం...

## టిజీఎస్ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బాబు...

సికింద్రాబాద్, మే 26 (వాయిస్ టుడే ప్రతినిధి): ఆర్టీసీ యాజమాన్యం ఇచ్చిన వేతన సవరణ 2021 ఉత్తర్వుల వల్ల కార్మికవర్గానికి అన్యాయం జరిగిందనీ టిజీఎస్ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు తెలంగాణ ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బాబు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2021 వేతన సవరణకు సంబంధించి 5 సంవత్సరాల వేతన బకాయిల గురించి ఆ ఉత్తర్వులలో లేకపోవడం కార్మికవర్గానికి అన్యాయం జరిగినట్లుగా భావిస్తున్నామన్నారు. 2021 నుండి రిటైరైన ఉద్యోగుల బకాయిల ఊసే యాజమాన్యం ఎత్తలేదని ఆయన విమర్శించారు. కార్మికులకు రావలసిన స్పెషల్ గ్రేడ్స్ దశాబ్దాల కాలంగా మార్పు లేకుండా 12 సంవత్సరాలు, 20 సంవత్సరాలుగానే ఉన్నాయన్నారు. కనీసం ఈ వేతన సవరణలో అయినా ఈ స్పెషల్ గ్రేడ్స్ మారుతాయని భావించామనీ, అలా మారకపోగా అధికారులకు రావలసిన కెరీర్ అడ్వాన్స్ మెంట్ స్కీమ్ ఆటోమేటిక్ అడ్వాన్స్ మెంట్ స్కీమ్ గా మారి అధికారులకు లాభం చేకూర్చిందని నిప్పులు చెరిగారు. సూపర్ వైజర్లు, ఆఫీసర్లకు గత 2 దశాబ్దాలుగా గ్రేడ్ పే ఉన్నదని, ఆ గ్రేడ్ పే ను 2021 వేతన సవరణలో బేసిక్ పే లో మెర్జ్ చేశారని దండెత్తారు. ఆర్టీసి ప్రభుత్వంలో విలీనం కాబోతోందని, విలీనం జరిగిన తరువాత ఈ గ్రేడ్ పే ని ఎలాగైనా తీసివేస్తారని ముందుగానే జాగ్రత్త పడి దాన్ని బేసిక్ పే లో మెర్జ్ చేసుకోవడాన్ని చాలా తీవ్రంగా భావిస్తున్నామన్నారు. ఎపిఎస్ ఆర్టీసిలో ఆర్టీసి ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనం అయిన తరువాత ఈ గ్రేడ్ పే ను బేసిక్ పే లో మెర్జ్ చేయకుండా పూర్తిగా తీసివేశారని ఆయన గుర్తు చేశారు. గత 2 దశాబ్దాలుగా టైపిస్ట్ ల స్పెషల్ పే ను వారి బేసిక్ పే లో మెర్జ్ చేయాలని యూనియన్లు డిమాండ్ చేసినా, ఇంతవరకు మెర్జ్ చేయని యాజమాన్యం గ్రేడ్ పే ను బేసిక్ పే లో మెర్జ్ చేయటం అన్యాయం అన్నారు. 2013 అలవెన్సులే 2021 లో కొనసాగుతాయని ఉత్తర్వులు ఇవ్వడంలో అర్థం లేదన్నారు. ఆర్టీసి యాజమాన్యంతో జాయింట్ యాక్షన్ కమిటీ జరిపిన చర్చల్లో 80 శాతం అలవెన్సులు పెంచుతామన్న యాజమాన్యం ఆ విషయాన్ని ఈ సర్క్యులర్ లో ఎందుకు చెప్పలేదని ఆయన ప్రశ్నించారు. ప్రతి 4 సంవత్సరాలకు ఆర్టీసిలో వేతన సవరణ జరుగుతుంది. కాని ఇంక్రిమెంట్ల స్పాన్ మాత్రం 6 సంవత్సరాలు పెట్టడం కార్మికులకు అన్యాయం చేయటమే అన్నారు. సి.సి.ఎ కూడా పెరగలేదని, పాత పద్ధతినే కొనసాగిస్తూ ఆదేశాలు ఇవ్వటం సరియైనది కాదన్నారు. కష్టపడి కార్మికులు సమ్మె చేశారని, ఆ సమ్మెను భగ్నం చేయటానికి అధికారులు, సూపర్ వైజర్లు విశ్వ ప్రయత్నం చేశారని, చివరకు కార్మికులకి జరగని లబ్ధి సూపర్ వైజర్లు, అధికారులకు చేకూరటాన్ని ఆయన తప్పు పట్టారు. కార్మికులకు ఉన్న ఫ్యామిలీ ప్లానింగ్ ఇంక్రిమెంట్ ను తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చిన యాజమాన్యం, సూపర్ వైజర్లు, అధికారుల గ్రేడ్ పే ను వారి బేసిక్ పేలో కలుపుకోవడం చీమలు పెట్టిన పుట్టలో పాములు దూరటం లాంటిదన్నారు. 2017 వేతన సవరణలో అలవెన్సులు చేయకుండా యాజమాన్యం కార్మిక ద్రోహం చేసిందన్నారు. ఇచ్చిన ఉత్తర్వులను సవరణ చేస్తూ కెరియర్ అడ్వాన్స్ మెంట్ స్కీం, డ్రైవర్ కండక్టర్లతో పాటు ఇతర ఉద్యోగులకు కూడా వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. టైపిస్టుల స్పెషల్ పే ను కూడా గ్రేడ్ పే లాగా బేసిక్ పే లో కలపాలని ఆయన డిమాండ్ చేశారు. 80 శాతం అలవెన్సులు పెంచుతూ వెంటనే సర్క్యులర్ విడుదల చేయాలన్నారు. 2021 వేతన సవరణలో కార్మికులకు రావలసిన ఎరియర్స్ వెంటనే చెల్లించాలని, 2017 లో రిటైరైన కార్మికులకు మరియు 2021 లో రిటైరైన కార్మికులకు వేతన సవరణ బకాయిలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

## గాంధీ ఆస్పత్రి నుంచి రిమాండ్ ఖైదీ పరారీ

సికింద్రాబాద్, మే 26 (వాయిస్ టుడే ప్రతినిధి): గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ రిమాండ్ ఖైదీ పోలీసుల కళ్లు గప్పి పరారయ్యాడు. తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కేసులో నిందితుడిగా ఉన్న బోయిన్ పల్లికి చెందిన సయ్యద్ అమీర్ హుస్సేన్ అనే యువకుడు గత పది రోజుల నుంచి చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. అయితే ఈ నెల 24న అతడు జైల్లో ఐదు ఇనుప మేకులను మింగడంతో ఒక్కసారిగా ఆరోగ్యం క్షీణించింది. దీంతో అప్రమత్తమైన జైలు అధికారులు అతడికి ఎక్స్-రే పరీక్షలు, తదుపరి అత్యవసర చికిత్స నిమిత్తం సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన ముగ్గురు ఏఆర్పీసీల భద్రత నడుమ గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల పర్య వేక్షణలో ఆదివారం సాయంత్రం అతడిని ఆస్పత్రిలోని టీఎంటీ వార్డులో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో నిందితుడు అమీర్ హుస్సేన్ వాష్ రూమ్‌కు వెళ్లాలని ఎస్కార్ట్ పోలీసులను కోరడంతో వారు వార్డులోని వాష్ రూమ్‌కు పంపించారు. అయితే ఎంత సేపటికీ అతడు బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన పోలీసులు లోపలికి వెళ్లి పరిశీలించగా అప్పటికే నిందితుడు వాష్ రూమ్ కిటికీ గుండా బయటకు దూకి, ఆస్పత్రి ప్రాంగణం నుంచి చాకచక్యంగా పరారైనట్లు గుర్తించారు. ఖైదీ పారిపోయాడని తెలుసుకున్న పోలీసులు వెంటనే అప్రమత్తమై ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో గాలించి నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. చట్టపరమైన పోలీసు కస్టడీ నుంచి ఖైదీ పరారు కావడంతో, విధుల్లో నిర్లక్ష్యం వహించిన కానిస్టేబుల్ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు చిలకలగూడ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరారైన ఖైదీ పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.కాగా ఆసుపత్రి నుంచి తప్పించుకున్న ఖైదీ నీ మంగళ వారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది.



## ఏసీపీ శంకర్ రాజు బర్త్ డే సందర్భంగా హెల్మెట్ల పంపిణీ

సికింద్రాబాద్, మే 26 (వాయిస్ టుడే ప్రతినిధి): తిరుమలగిరి డివిజన్ ట్రాఫిక్ ఏసిపి జి.శంకర్ రాజు జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏసిపి శంకర్ రాజు మాట్లాడుతూ నగరంలో రోజు రోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారు లు హెల్మెట్ ధరించక పోవడం వల్ల ప్రమాదాల్లో తీవ్ర గాయాల పాలవుతూ ప్రాణ నష్టాలు సంభ విస్తున్నాయని అన్నారు. ప్రమాదాల సమయంలో తలకు గాయాలు కాకుండా రక్షించడంలో హెల్మెట్ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. అయినప్పటికీ చాలామంది యువత హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ట్రిపుల్ రైడింగ్, అతివేగం వంటి కారణాలతో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ట్రాఫిక్ పోలీసులు తరచూ ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదు చేస్తున్నా కొందరిలో నిర్లక్ష్య ధోరణి కొనసాగుతోందని పేర్కొన్నారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించడం, అతివేగాన్ని నివారించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించ వచ్చని అన్నారు. యువతలో కొంత వరకైనా మార్పు తీసుకురావాలని ,హెల్మెట్ ధరించడం తప్పని సరిగా అలవాటు చేయాలనే ఉద్దేశ్యంతో తన పుట్టిన రోజు సందర్భంగా ఉచితంగా హెల్మెట్ల పంపిణీ చేసినట్లు ఏసిపి శంకర్ రాజు తెలిపారు.ఈ సంద ర్భంగా ఆయనకు పలువురు పోలీసులు, జర్నలిస్టులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రతి బూత్ ఏజెంట్ ఒక సైనికుడిలా పనిచేయాలి

### క్షేత్ర స్థాయిలో పూర్తి అవగాహన కలిగి ఉండాలి

### SIR పై పార్టీ బూత్ స్థాయి నాయకత్వం దృష్టి సారించాలి

### బూత్ ఏజెంట్ అవగాహన సదస్సులో ఎమ్మెల్యే నాయిని



ప్రతి బూత్ ఏజెంట్ పార్టీకి సైనికుడిలా పనిచేయాలని, క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు, ఓటర్ల వివరాలు,ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పశ్చిమనియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ లోని అంబేద్కర్ భవన్ లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ స్థాయి బూత్ ఏజెంట్ల అవగాహన సదస్సుకు ముఖ్య అతిథులుగా వరంగల్ పార్లమెంట్ సభ్యులు కడియం కావ్య,డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ SIR (Special Intensive Revision) ప్రక్రియపై ప్రత్యేకంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పూర్తి స్థాయి పట్టణ వాతావరణంలో ఉండటంతో ఓటర్లను గుర్తించడం,వారి వివరాలను నిరంతరం అప్‌డేట్ చేయడం చాలా క్లిష్టమైన ప్రక్రియ అని తెలిపారు. ప్రజలు తరచూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారడం,అద్దె ఇళ్లలో నివసించడం,ఉద్యోగాల కారణంగా చిరునామాలు మారడం వల్ల ఓటరు జాబితాలో ఖచ్చితత్వం నిలుపుకోవడం సవాల్‌గా మారుతుందని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో ుా×= ప్రక్రియ మరింత దోహదపడుతుందని పేర్కొన్నారు. గతంలో 2002లో జరిగిన SIR ప్రక్రియ మళ్లీ 2026లో నిర్వహించబడుతున్న నేపథ్యంలో పార్టీ నాయకులు,బూత్ ఏజెంట్లు దీనిని అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ప్రతి ఓటరును మ్యాపింగ్ చేసుకోవడం,కుటుంబాల వారీగా వివరాలు నమోదు చేయడం,కొత్త ఓటర్ల గుర్తింపు,మారిన ఓటర్ల వివరాల సవరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఈ ప్రక్రియలో నిర్లక్ష్యం చేస్తే భారీ నష్టం జరిగే అవకాశముందని ఎమ్మెల్యే హెచ్చరించారు. సరైన మ్యాపింగ్ లేకపోతే అర్హులైన ఓటర్లు జాబితా నుంచి తప్పిపోవడం,డూప్లికేట్ నమోదులు పెరగడం,పోలింగ్ రోజు గందరగోళ పరిస్థితులు తలెత్తడం వంటి సమస్యలు వస్తాయని తెలిపారు. బూత్ స్థాయిలో ఒక్క చిన్న పొరపాటు కూడా ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని అన్నారు.

హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో నేరుగా మాట్లాడాలని,ఓటర్ల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, పార్టీ బూత్ స్థాయి వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికే డివిజన్ ల వారీగా ఇంచార్జిలను ఏర్పాటు చేయడం జరిగిందని రేపటి నుంచి ఇంచార్జ్ లు డివిజన్ లలో బూత్ స్థాయి కన్వీనర్స్,ఏజెంట్స్,డివిజన్ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతర ఎంపీ కడియం కావ్య ఏర్పాటు చేసిన బూత్ లెవెల్ ఏజెంట్ సంక్షిప్త సమాచార హ్యాండ్ బుక్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు,కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు,డివిజన్ అధ్యక్షులు,నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రాష్ట్ర లైసెన్స్ సర్వేయర్‌లకు గౌరవ వేతనం ప్రకటించాలి

### లైసెన్స్ సర్వేయర్ రాష్ట్ర అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి శేఖర్

సికింద్రాబాద్, మే 26 (వాయిస్ టుడే ప్రతినిధి): రాష్ట్ర లైసెన్స్ సర్వేయర్ లకు గౌరవ వేతనం ప్రకటించాలని లైసెన్స్ సర్వేయర్ రాష్ట్ర అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి శేఖర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద రాష్ట్ర లైసెన్స్ సర్వేయర్ లు మహా ధర్నా చేపట్టారు ఈ ధర్నాకు రాష్ట్ర అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి శేఖర్ హాజరై మాట్లాడుతూ.. లైసెన్స్ సర్వేయర్ వ్యవస్థను ప్రారంభించి సంవత్సరం పూర్తయిందని, ఈ ఏడాదికాలంగా ఏ విధమైన అమలు జరిగింది ఎలాంటి ప్రాణాలికతో తీసుకువచ్చారు, ఎందుకు తీసుకువచ్చారు అనే విషయాలు ఇప్పటికి స్పష్టత లేదన్నారు. తద్వారా 6500 లైసెన్స్ సర్వేయర్ కుటుంబాలు పూర్తిగా ఆర్థికంగా దెబ్బతిన్నాయని గతంలో పలుమార్లు ఈ వ్యవస్థపై గైడ్‌లైన్స్ కోరాము. కానీ ఇప్పటివరకు సరైన మార్గదర్శకాలు ఇవ్వలేదు. కార్యాలయాల చుట్టూ తిరిగినా పని ఇవ్వడం లేదన్నారు. రెవెన్యూ వ్యవస్థ తెలంగాణలో అత్యంత కీలకమైనది. కానీ దానిని పట్టించుకోకుండా ఈ విధంగా వ్యవహరించడం బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరిస్తామని లైసెన్స్ వ్యవస్థ తీసుకువచ్చారు. కానీ వాస్తవానికి దీనివల్ల లాభపడింది కొందరు రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వ్యవస్థలోని కొందరు మాత్రమే. మిగతా వారందరికీ ఉపాధి లేదు, ఆదాయం లేదు. ఈ వ్యవస్థ ద్వారా ఒక్క రూపాయి కూడా మా చేతికి రాలేదు. పని కూడా కల్పించలేదు. తెలంగాణలో కోట్లాది ప్రజలకు ఉపయోగపడే వ్యవస్థను కేవలం 6500 మందితో పరిమితం చేశారు అని తెలిపారు.మేము ఆఫీసులకు వెళ్లి అడిగితే లోపలికి కూడా అనుమతించని పరిస్థితి ఉంది. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి మాకు గౌరవ వేతనం ప్రకటించాలి. స్థిరమైన పని ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. హెల్త్ కార్డులు ఇవ్వాలి. లైసెన్స్ వ్యవస్థను ప్రభుత్వ పరిధిలోకి తీసుకోవాలి అని విజ్ఞప్తి చేశారు. ఎకరం భూమి కొలిస్తే కేవలం 50 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని . 50 రూపాయలతో కుటుంబం నడవదు. కనీసం 600 మందికి నెలకు 30 వేల జీతం ప్రకటిస్తే, మేము ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. మా జీవితాలు నిలదొక్కుకోవాలంటే ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలి అని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రంగు శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగ్ విద్యార్థిని అదృశ్యం

సికింద్రాబాద్, మే 26 (వాయిస్ టుడే ప్రతినిధి): గాంధీ కాలేజీలో చదుతున్న నర్సింగ్ విద్యార్థిని కనిపించకుండా పోయిన సంఘటన చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చిలకలగూడ ఇన్స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన బి.నందిని (17) అనే యువతి గాంధీ హాస్పిటల్ లో నర్సింగ్ విద్యను అభ్యసిస్తోంది. కాగా ఇటీవల కుటుంబ సభ్యులు ఆమెకు పెళ్లి సంబంధాలు వెతుకుతున్నారు. ఇదే క్రమంలో ఈ నెల 24వ తేదీన కుటుంబ సభ్యులు ఆమె వివాహానికి సంబంధించి చర్చలు జరిపినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం తనకు హాస్పిటల్‌లో పని ఉందని తనను ఆసుపత్రి వద్ద దిగబెట్టాలని తండ్రిని కోరింది. దీంతో నందినినీ ఈ నెల 25 తేదీ తెల్లవారుజామున సుమారు 3.30 గంటలకు ఆమెతండ్రి బి.నర్సింహులు గాంధీ హాస్పిటల్ వద్ద దింపారు. అప్పటి నుంచి ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. నందిని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చిలకలగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గల్లంతైన బాలికకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా చిలకలగూడ పోలీసులను సంప్రదించాలని ఇన్స్పెక్టర్ రామకృష్ణ కోరారు.

## ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై కేసులను ఉపసంహరించుకోవాలి

### ఏపీ ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలి

### అరెస్టు ప్రయత్నాలు మానుకోవాలి: టిఎస్ యుటిఎఫ్

సికింద్రాబాద్, మే 26 (వాయిస్ టుడే ప్రతినిధి): ప్రముఖ మీడియా విశ్లేషకుడు, విశ్రాంత ఆచార్యులు నాగేశ్వర్ పై ఆంధ్రప్రదేశ్ లోని వివిధ పోలీసు స్టేషన్లలో బనాయించిన కేసులను ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఎ వెంకట్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆచార్య నాగేశ్వర్జ ర్నలిజం అధ్యాపకునిగా ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులకు పాఠాలు బోధించడంతో పాటు, సివిల్ సర్వెంట్స్ మొదలు రాజకీయ నాయకుల వరకు వివిధ అంశాలపై శిక్షణనిస్తూ పాలకులు ఎవరైనా నిక్కచ్చిగా, సామాజిక కోణంలో తన అభిప్రాయాలను వెల్లడిస్తున్నారనీ, గత, ప్రస్తుత ముఖ్య మంత్రులతో సహా రాష్ట్రంలోని దాదాపు అన్ని రాజకీయ పార్టీలు ఏదోఒక సంద ర్భంలో ఆయన సలహాలు తీసుకున్నవారే నాని అన్నారు. ఒక టివి ఛానల్ ఇంట ర్వ్యూలో నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు అసభ్యంగానో, వ్యక్తిగత విమర్శలో కావు. ఆయన వ్యాఖ్యలు నచ్చనివారు ప్రజాస్వామ్యయుతంగా ఖండించవచ్చన్నారు. తన వ్యాఖ్యలపై అభ్యంతరాలు వ్యక్తమైన వెంటనే వాటిని వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అయినా ఆయనపై కేసులు పెట్టి అరెస్టు చేయాలని ప్రయత్నించడం విజ్ఞత అనిపించుకోదనీ, ఈ చర్య మీడియా స్వేచ్ఛపై దాడిగానే భావించాల్సి ఉంటుందనీ అన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జోక్యం చేసు కొని కేసులను ఎత్తివేసి ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని కోరుతున్నామన్నారు.

## రూ.25 కోట్లకు 'రియల్' టోకరా

### ఎస్వీఎం ఆదిత్య హోమ్స్‌పై కేసు నమోదు

హైదరాబాద్: రియల్ ఎస్టేట్ పేరిట రెండు వేర్వేరు మోసాల్లో బాధితులు రూ.25 కోట్లు పోగొట్టుకున్నారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపల్లిలో విల్లాల నిర్మాణం పేరిట రూ.15.10 కోట్లు వసూలు చేసిన ఎస్వీఎం ఆదిత్య హోమ్స్ సంస్థపై సైబరాబాద్ ఈవోడబ్ల్యూలో కేసు నమోదైంది. సంస్థ భాగస్వాములు ఎన్.శ్రీనివాస్ బాబు, జూలకంటి మధుసూదన్‌రెడ్డి పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఖానామెట్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రామారావుకు 2023 అక్టోబరులో రంజిత, నితీశ్ కుమార్ ఫోన్ చేశారు. కిష్టారెడ్డిపల్లిలో 9 ఎకరాల్లో విల్లాలు నిర్మిస్తున్నట్లు వివరించారు. సంస్థకు ఎన్.శ్రీనివాస్ బాబు, జూలకంటి మధుసూదన్‌రెడ్డి భాగస్వాములని తెలిపారు. అన్ని అనుమతులు ఉన్నాయని చెప్పడంతో నమ్మిన రామారావు కొండాపూర్‌లోని సంస్థ కార్యాలయాన్ని సందర్శించారు. విల్లా నంబరు 92, 183ను రూ.1.79 కోట్లకు కొనేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. 2024 ఏప్రిల్‌లో రూ.80 లక్షలు చెల్లించారు. నెలలు గడిచినా పనులు ప్రారంభం కాలేదు. ఆరా తీయగా.. 20 మంది నుంచి రూ.15.10 కోట్లు వసూలు చేసినట్లు తెలుసుకొని పోలీసులను ఆశ్రయించారు.

వాయిస్
హైదరాబాద్
బుధవారం 27 మే 2026

# ఆర్టీసీ డ్రైవర్ సస్పెన్షన్ దుర్మార్గపు చర్య

## మాజీ మంత్రి గంగుల కమలాకర్



కరీంనగర్, మే 26(వాయిస్ టుడే): వడ్ల కొనుగోలుపై ప్రశ్నించేందుకే ఆర్టిసి డ్రైవర్ పై వేటు వేయడాన్ని మాజీ మంత్రులు గంగుల కమలాకర్,జీవన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.వడ్ల కొనుగోలు చేపట్టండి అని అడిగిన జగిత్యాల డిపో ఆర్టిసి డ్రైవర్ అశోక్ ను విధుల నుండి తొలగించడాన్ని నిరసిస్తూ మాజీ మంత్రులు గంగుల కమలాకర్,జీవన్ రెడ్డిల ఆధ్వర్యంలో గులాబీ శ్రేణులు ఆందోళనబాట పట్టారు.తొలగించిన ఆర్టిసి డ్రైవర్ అశోక్ ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలంటూ ఆర్టిసి ఆర్ఎంకు వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వమంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నియంతృత్వ పాలన కొనసాగిస్తుందన్నారు.ధాన్యం కొనుగోలు అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్ సస్పెన్షన్ దుర్మార్గమన్నారు.సస్పెండ్ చేసిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్ కు బి.అర్.ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.డ్రైవర్ సస్పెన్షన్ ఎత్తివేసే వరకు అవసరమైతే అర్.ఎం కార్యాలయం ముందు బైఠాయిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించినంత మాత్రాన డ్రైవర్ అశోక్ నుసస్పెన్షన్ చేయడం సరికాదన్నారు.బి.అర్.ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తాత్కాలిక డ్రైవర్ గా ఉన్న అశోక్ ను పర్మినెంట్ డ్రైవర్ గా ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామి ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బారస నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# పెంచిన ఇంధన ధరలను తగ్గించాలి

## ఎడ్ల బండిపై సుడా కార్యాలయానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

## ఇంధన ధరల పెంపుతో సామాన్యుల జీవితాలు అతలాకుతలం

కరీంనగర్, మే 26(వాయిస్ టుడే): రోజు రోజుకు పెరుగుతున్న పెట్రోల్ డీజిల్ ధరలకు నిరసనగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఎడ్ల బండిపై ఇంటి నుండి సుడా కార్యాలయానికి వెళ్లారు.ఎడ్ల బండి నడుపుకుంటూ వెళ్తూ మార్గ మధ్యలో ఆగుకుంటూ ప్రజలకు పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని వివరించారు.సుడా కార్యాలయానికి చేరుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్లో పాయిజన్ ఇచ్చినట్టు రోజు రోజుకు పెట్రోల్ డీజిల్ ధరలు పెంచుతూ సామాన్యుడు జీవితంపై తీవ్ర భారం మోపుతున్నారని దీని వల్ల అన్నిటిపై ప్రభావం పడి ధరలు పెరుగుతాయని అన్నారు.గతంలో యుపిఎ ప్రభుత్వం హాయంలో అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ ధర ఇప్పుడున్న దానికంటే ఎక్కువ ఉన్నా ఆరోజు అరవై రూపాయలకు అందిందించిందని వెంటనే పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని లేకపోతే వాహనాలలో తిరిగే పరిస్థితి లేదని అందుకే నేను ఎడ్ల బండిపై ఆఫీసుకు వచ్చానని చెప్పారు.మోడీ సర్కార్ కు మాటల గారడి చేసి ప్రజలను మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్య అని పరిస్థితి ఇదే విధంగా కొనసాగుతే ప్రజలతో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని ధరలు దించే వరకు వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మల్లిఖార్జున రాజేందర్,పర్వతం మల్లేశం,జగన్ రెడ్డి,గుండటి శ్రీనివాస్ రెడ్డి,పిట్టల రవీందర్,సుదర్శన్, శ్రీధర్ రెడ్డి,పటేల్ శ్రీనివాస్ రెడ్డి,కాంపెల్లి కీర్తి కుమార్,గడమళ్ళ శ్రీనివాస్ పాల్గొన్నారు.




# పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన కరీంనగర్ సీపీ గౌష్ ఆలం

జమ్మికుంట మే 26 (వాయిస్ టుడే): జమ్మికుంట పోలీస్ స్టేషన్‌ను కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు చేరుకున్న సీపీకి ఇన్స్పెక్టర్ రామకృష్ణ పూలమొక్కను అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సి పి సిబ్బందికి పలు సూచనలు చేశారు.



సాంకేతికత వినియోగం: తెలంగాణ పోలీసులు ప్రవేశపెట్టిన జజుచీూ - 2.0, యా-జుహ్రా, ఈ-సాక్ష్య, సైబర్ క్రైమ్ టూల్స్, బాడీ వార్న్ కెమెరాల వంటి ఆధునిక సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై సిబ్బంది పూర్తి పట్టు సాధించి, రోజువారీ విధుల్లో వాటిని విరివిగా ఉపయోగించాలని ఆదేశించారు.

కేసుల త్వరితగతిన పరిష్కారం: స్టేషన్‌లోని రికార్డులను, ఎఫ్.ఐ.ఆర్ ఇండెక్స్‌ను పరిశీలించి, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

గ్రామ పోలీస్ వ్యవస్థ:లిలి జమ్మికుంట పరిధిలోని గ్రామాలను సెక్టార్లు, సబ్-సెక్టార్లుగా విభజించి గ్రామ పోలీస్ అధికారులను కేటాయించాలన్నారు.

విజిబుల్ పోలీసింగ్: సైబర్ నేరాలపై అవగాహన పెంచాలని, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు.

సిబ్బందికి సూచనలు: పోలీస్ సిబ్బంది విధుల్లో నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని.. రిసెప్షన్, పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను సక్రమంగా నిర్వహించాలని స్పష్టం చేశారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో జమ్మికుంట టౌన్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, రూరల్ ఇన్స్పెక్టర్ వెంకట్, మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా 100 రోజుల్లోనే నిధులు తీసుకొచ్చా...

## కార్పొరేటర్లూ గల్లా ఎగరేసుకుని అభివృద్ధి పనులు చేపట్టండి

## యూసీఎఫ్ నిధుల విడుదల చేసిన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కట్టర్‌లకు ధన్యవాదాలు

## సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు

## కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

కరీంనగర్,మే 26(వాయిస్ టుడే): గత మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పదవిని బీజేపీకి అప్పగిస్తే కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తానంటూ తాను ఇచ్చిన మాటను 100 రోజుల్లోనే నిలబెట్టుకున్నానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు.ఇచ్చిన మాట ప్రకారం యూసీఎఫ్ స్కీంలో భాగంగా కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం రూ.840 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు.యూసీఎఫ్ జాబితాలో కరీంనగర్ ను చేర్చడం వెనుక తెరవెనుక చాలా కష్టపడాల్సి వచ్చిందన్నారు. సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి క్రుతజర్ఞుతలు తెలిపారు. కష్టపడి పనిచేసిన జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, అధికారులను అభినందిస్తున్నట్లు చెప్పారు.కేంద్రం నుండి కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు తన పార్లమెంట్ నియోజక వర్గానికి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కరీంనగర్ కార్పొరేషన్ ను మోడల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతానన్నారు. గతంలో నిధుల్లేక పనులు చేయలేక కార్పొరేటర్లు ఎంతో సతమతమయ్యే వారన్నారు.ఈసారి ఆ సమస్య లేదని,గల్లా ఎగరేసుకుంటూ కార్పొరేటర్లంతా తమ తమ డివిజన్లలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని సూచించారు. కరీంనగర్ శివారు ప్రాంతాల్లోనూ చకచకా అభివృద్ధి పనులను కొనసాగిస్తామని చెప్పారు.1 కోటి 39 లక్షల రూపాయల అంచనా వ్యయంతో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ భవనం రెండో అంతస్తు నిర్మాణ పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు.వీటితోపాటు కార్మిక ఆరోగ్య సంక్షేమ భవన పునరుద్దరణ,షెడ్ల మరమ్మతు పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్,డిప్యూటీ మేయర్ సునీల్ రావు,కార్పొరేటర్లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ గత మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధి బాధ్యత తీసుకుంటానని మాట ఇచ్చిన. ఇచ్చిన మాట ప్రకారం 100 రోజుల్లోపే రూ.840 కోట్లు నిధులు తీసుకొచ్చిన. ప్రదాని మోదీ,కేంద్ర మంత్రి కట్టర్ లకు ధన్యవాదాలు.రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరించింది.కష్టపడి ప్రతిపాదనలు రూపొందించి వెంట వెంటనే పంపిన జిల్లా కలెక్టర్,మున్సిపల్ కమిషనర్ సహా అధికారులను అభినందిస్తున్నా. ప్రతిపాదనలు పంపిన 48 గంటల్లోపే ఢిల్లీలో మీటింగ్ పెట్టించిన. వెంటవెంటనే కేంద్ర టీం కూడా కరీంనగర్ కు వచ్చింది.కొందరు అధికారులు యూసీఎఫ్ జాబితాలో కరీంనగర్ ఉండే అవకాశం లేదని చెప్పారు.అయినా మొండి పట్టుదలతో కేంద్ర పెద్దలను ఒప్పించి యూసీఎఫ్ జాబితాలో కరీంనగర్ ను చేర్పించాను.దేశవ్యాప్తంగా 17 ప్రాజెక్టులకు మాత్రమే కేంద్రం ఆమోదం తెలిపింది.అందులో కరీంనగర్ ఉండటం మనందరికీ గర్వకారణం.యూసీఎఫ్ నిధులు విడుదల వెనుక తెరవెనుక చాలా కష్టపడ్డాం.కరీంనగర్ కార్పొరేషన్ ను అభివృద్ధి చేయాలని కసితో పనిచేస్తున్నా. యూసీఎఫ్ నిధులతో కరీంనగర్ కార్పొరేషన్ రూపురేఖలే మార్చబోతున్నాం.డంపింగ్ యార్డు కోసం కూడా రూ.80 కోట్లు విడుదలయ్యాయి.నిధుల్లేక గతంలో కరీంనగర్ కార్పొరేటర్లు పడ్డ కష్టాలు నాకు తెలుసు.ఈసారి పుష్కలంగా నిధులొస్తున్నాయి.గల్లా ఎగరేసి అభివృద్ధి పనులు చేసుకోవచ్చు. గతంలోనూ రూ.900 కోట్ల స్మార్ట్ సిటీ నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేసినం.అమ్రుత్ 1,2 ద్వారా రూ.277 కోట్లు ఖర్చు చేసినం.శివారు ప్రాంతాలను కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం.కరీంనగర్ సిటీలో పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తా. నా ఏడేళ్ల ఎంపీ పదవీ కాలంలో రూ.20 వేల కోట్లకుపైగా నిధులు తీసుకొచ్చిన. శాతవాహన కాలేజీకి 12బి హోదా తీసుకొచ్చిన.లా కాలేజీ మంజూరు చేయించిన.ఎస్సారార్ కాలేజీకి అటానమస్ హోదా తెచ్చిన. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియం అభివృద్ధికి నిధులు తెచ్చిన. జమ్మికుంట స్టేడియం నిర్మాణం కోసం నిధులు తెచ్చిన.సీఎస్సార్ నిధులతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెడికల్ ఎక్విప్ మెంట్స్ అందించిన. ప్రభుత్వ స్కూళ్లలో టెన్త్ చదివే విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లు అందించిన.త్వరలోనే మళ్లీ టెన్త్ విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందిస్తా.కరీంనగర్ కార్పొరేషన్ కు నిధుల వరద పారిస్తా. రాష్ట్రంలోనే కరేంనగర్ కార్పొరేషన్ ను మోడల్ కార్పొరేషన్ గా తీర్చిదిద్దుతా. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.వేల కోట్ల నిధులు తీసుకొస్తా.కేంద్ర పారామిలటరీ గ్రూప్ సెంటర్ ఏర్పాటుకు 14 ఎకరాలు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు.అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్,సీఆర్పీఎఫ్ బెటాలియన్ల ఏర్పాటుకు క్రుషి చేస్తున్నా. ఆయా బెటాలియన్లలో పనిచేస్తున్న సౌత్ ఇండియన్స్ పోస్టింగులన్నీ నార్త్ ఈస్ట్ బెటాలియన్లకే పరిమితం అవుతున్నాయి.తద్వారా వారి కుటుంబాలకు దూరం అవుతున్నారు. దీనిని ద్రుష్టిలో ఉంచుకునే ఇక్కడే బెటాలియన్లు ఏర్పాటు చేయడానికి క్రుషి చేస్తున్నా.ఎన్నికల వరకే రాజకీయాలు.ఎన్నికల తరువాత అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నాం. రాబోయే రోజుల్లో రాజకీయాలకు అతీతంగా కలసి మెలిసి అభివృద్ధి చేద్దాం.రూ.50 కోట్ల అర్బన్ డెవలప్ మెంట్ ఫండ్ తో అన్ని డివిజన్లలో రేపటి నుండి అభివృద్ధి పనులు ప్రారంభం కాబోతున్నాయి.మరో రూ.50 కోట్లు విడుదల కోసం ప్రతిపాదనలు పంపాం.రాబోయే రోజుల్లో ఏ స్కీం వచ్చినా కరీంనగర్ పార్లమెంట్ లోని మున్సిపాలిటీలను చేర్పించేందుకు యత్నిస్తున్నా అన్నారు.ధాన్యం కొనుగోలు పైసలన్నీ కేంద్రానివా? రాష్ట్రానివా? సమాధానం చెప్పాలి.సుతిలీతాడు మొదలు రవాణా ఖర్చులన్నీ కేంద్రమే ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కేవలం మధ్యవర్తి మాత్రమే. మధ్యవర్తిత్వం చేసినందుకు కేంద్రం రాష్ట్రానికి కమీషన్ కూడా ఇస్తోంది.అయినా ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి విఫలమవుతోంది.ఇకనైనా బేషజాలకు పోకుండా యుద్ద ప్రాతిపదికన ధాన్యం కొనుగోలును పూర్తి చేయాలని కోరుతున్నా.ఇచ్చిన మాట ప్రకారం ప్రతి గింజను కొనుగోలు చేయండి. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వండి. పొరపాట్లు జరిగిన చోట గుర్తించి వెంటనే సరి చేసుకుని వడ్లను కొనుగోలు చేయాలి. రైతుల సమస్యలను ప్రభుత్వం ద్రుష్టికి తీసుకొచ్చేందుకు బీజేపీ రైతు గోస బీజేపీ భరోసా పేరుతో యాత్రలు చేస్తున్నాం అన్నారు.



# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ పెన్షనర్స్‌కు నూతన పి ఆర్ సి నీ వెంటనే ప్రకటించాలి

## టా ప్ర కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్

హుజురాబాద్ మే 26 (వాయిస్ టుడే): తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ హుజురాబాద్ యూనిట్ ఆధ్వర్యంలో పట్టణములోని స్థానిక టా ప్రా కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న టా ప్ర కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, గౌరవ అధ్యక్షుడు కట్ట నాగభూషణాచారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్స్ కు ఇచ్చిన హామీ మేరకు జూలై ఒకటి 2023 నాడు అమలులో ఉన్నా డి ఏ ను మాత్రమే విలీనం చేస్తూ నూతన పి ఆర్ సి ని ప్రకటించి జూలై 2023 నుండి వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ అమలుకు ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయకుండానే ఈ నెల 31 వరకు పెన్షనర్స్ అందరూ నిర్ణీత ఫారంలో వివరాలను అందజేయాలని కోరి పెన్షనర్లందర్నీ గందరగోళానికి గురి చేయకుండా తక్షణమే మార్గదర్శకాలను విడుదల చేస్తూ ఈ హెచ్ ఎస్ ప్రీమియం ఒక శాతానికి మించకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వము ఇచ్చిన హామీ మేరకు పెన్షనర్ల పెన్షనరీ బకాయిలు ఇతర పెండింగ్ బిల్లులు 100 రోజుల లోపు చెల్లించబడునట్లు విధి విధానాలను ప్రకటించి తక్షణమే పెండింగ్ బిల్లులన్నింటినీ మంజూరు చేస్తూ పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినారు. కార్యక్రమంలో టా ప్రా హుజురాబాద్ యూనిట్ అధ్యక్షుడు భారత ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి చీకట్ల సమ్మయ్య, కోశాధికారి మండల వీరస్వామి, టా ప్రా నాయకులు బొంగోని వెంకటయ్య, తాటిపాముల కనకయ్య, దొంత హరికిషన్ , గౌరీశెట్టి సాంబయ్య, కంది రాజి రెడ్డి, తౌటం శ్రీహరి, మేకల మొగిలయ్య, తిరునగరి రమేష్ , చాడ సమ్మిరెడ్డి, పరాంకుశం, సనత్ కుమార్, మంతెన సుదర్శన్, గాజె గంగయ్య మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- తక్కువ ఖర్చు..నాణ్యమైన భోజనం
- మహిళలు వ్యాపార రంగంలో రాణించాలి




వేములవాడ, మే 26 (వాయిస్ టుడే) : మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా వేములవాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ముందు ఏర్పాటు చేసిన మెప్మా క్యాంటీన్ ఢ క్యాటరింగ్ కేంద్రాన్ని రాజరాజేశ్వరి దేవి మహిళా స్వశక్తి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ క్యాంటీన్‌ను ప్రారంభించారు. మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఇలాంటి క్యాంటీన్ల ఏర్పాటుకు పెద్దపీట వేస్తోందని, మహిళా సంఘాల సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వ్యాపార రంగంలో విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ?క్యాంటీన్ ప్రారంభోత్సవం అనంతరం వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ వేములవాడ ప్రభుత్వాసుపత్రికి వివిధ ప్రాంతాల నుండి వచ్చే పేద రోగులతో పాటు, వారి సహాయకులకు, అలాగే దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఈ క్యాంటీన్ ద్వారా ఎంతో మేలు జరుగుతుందని కొనియాడారు. చాలా తక్కువ ఖర్చుతోనే అందరికీ నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారం ఇక్కడ అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. దీనివల్ల ఒకవైపు ప్రజలకు తక్కువ ధరకే భోజన వసతి దొరకడమే కాకుండా, మరోవైపు స్థానిక మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు చక్కటి ఉపాధి లభించి వారు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ క్యాంటీన్‌ను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్‌తో పాటు స్థానిక వార్డుల కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మెప్మా అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు మరియు పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అనుకూల ఓటర్ల తొలగింపునకు కేంద్రం కుట్ర

## సర్ పై అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు కవ్వంపల్లి పిలుపు



తిమ్మాపూర్, మే 26(వాయిస్ టుడే): కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న ఓటర్లను ఓటరు జాబితాను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సర్ కార్యక్రమం పట్ల కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్,మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జీ,కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అధ్యక్షతన జరిగిన మండల,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ అనుకూల ఓటర్లను తొలగించే ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం ఎస్ఐఆర్ (సర్) కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ ఓటర్లను తొలగించే కుట్రలు జరుగుతున్నాయన్నారు.ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగించే ఈ తరహా చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని డాక్టర్ కవ్వంపల్లి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా అప్రమత్తంగా ఉండి ప్రతి ఓటరును కాపాడే బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు.గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు నాయకులు,కార్యకర్తలు ఓటరు జాబితాలను పరిశీలించి ఎలాంటి అవకతవకలు జరిగినా వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.ప్రజల ఓటు హక్కును రక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.సర్ పై మండలాల వారీగా పార్టీ సమావేశాలు నిర్వహించడమే కాకుండా అన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ కవ్వంపల్లి కోరారు.కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జీ,కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికలకు పార్టీశ్రేణులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి,ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.అలాగే కార్యకర్తలు ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పార్టీపై విశ్వాసాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ స్థాయిలో మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని, ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరేలా పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా చేపట్టిన సర్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని శ్రీశైలం గౌడ్ అన్నారు.జాబితాలో ఉన్న ఓటర్ల పేర్లు తొలగింపునకు గురికాకుండా చూడటంతోపాటు కొత్తవారిని ఎక్కువ సంఖ్యలో ఓటర్లుగా నమోదు చేయించడం కూడా మనకు అంతే ముఖ్యం కావాలన్నారు.పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, గ్రామస్థాయిలో పార్టీ విస్తరణపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి,,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని శ్రీనివాస్ గౌడ్,సుధగోని లక్ష్మినారాయణ,మండల పార్టీ అధ్యక్షులు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, బండారి తిరుపతి,బండారి రమేశ్, లింగాల శ్రీనివాస్,కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.



## పద్యకవి డా. వెంకట్‌కు ఏకదిన సంపూర్ణ శతావధాన ప్రాశ్నిక సాహితీ సన్మానం

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మే26: నిర్మల్ కు చెందిన సంస్కృతభాషా ప్రచార సమితి ఆదిలాబాదు నిజామాబాదు ఉమ్మడి జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రముఖ పద్యకవి, వ్యాఖ్యాత లిబి.వెంకట్‌లి హైదరాబాదులో "ఏకదిన సంపూర్ణ శతావధాన ప్రాశ్నిక సాహితీ సన్మానమును" "దర్శనమ్ ప్రధాన సంపాదకులు మరుమాముల వెంకటరమణశర్మ, అవధాన విద్యావికాస పరిషత్ వ్యవస్థాపకులు మరుమాముల దత్తాత్రేయశర్మ,అచ్చతెలుగు శతావధాని పాలపర్తి శ్యామలానందప్రసాద్‌శర్మ, అవధానులు- ముత్యంపేట గౌరీశంకరశర్మ, ఓంప్రకాశ్, జి ఆర్ రామశర్మ చేతులమీదుగా అందుకున్నారు."వెంకట్ దత్తపది అంశములో ప్రాశ్నికునిగా పాల్గొని, "ప్రపంచ యువత సంస్కృతిని మరచి మొబైల్ కు అంకితమై చెడిపోతుందని, సంస్కృత, సంస్కృతి, సంస్కారం,సంస్కరణ అను పదాలను ఇచ్చి,యువతకు పద్యరూపములో మంచి సందేశమును ఇవ్వుమని" అడిగారు.

హైదరాబాదు, నేరెడ్మెట్ దీన్దయాళ్ నగర్లోగల సెయింట్ మార్క్స్ హైస్కూల్లో దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక,అవధాన విద్యా వికాస పరిషత్ వారి 5 వ అవధాన పద్యశిక్షణ శిబిరం సమాపనోత్సవములో సభక్తికంగా నిర్వహించిన శతావధానతిలక,బ్రహ్మశ్రీ "ఉప్పలధడియం భరతశర్మగారి ఏకదిన సంపూర్ణ శతావధాన ప్రాశ్నిక సన్మానమును వెంకట్ పొందారు." ఈ నెల 18వ తేదీనుండి నేటివరకు తెలంగాణ ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల యువతీయువకులకు అవధాన విద్యపై ఉచిత శిక్షణను శతావధానులు- ఆముదాల మురళీ, డా బులుసు అపర్ణలచేత మరుమాముల సోదరులు ఇప్పించారని వెంకట్ చెప్పారు. అవధాన శిబిరానికి సహస్రావధానులు- వద్దిపర్తి పద్మాకర్,గరికపాటి వెంకట నరసింహారావు, మాడుగుల నాగఫణిశర్మ లు "ముఖ్య అతిథులుగా " పాల్గొని అవధానవిద్యపై సందేశాలు ఇచ్చారని అన్నారు.శతావధాని భరతశర్మ 100 ప్రశ్నలపై 100 పద్యాలను ఒకేరోజు 12 గంటల్లో శతావధానం చేశారని,అరగంటలో 100 పద్యాలను ధారణ చేసి, చరిత్ర సృష్టించారని చెప్పారు.వెంకట్‌ను జిల్లా కవులు, కళాకారులు, సాహితీపిపాసకులు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

## ఆదివాసుల నిరవధిక ధర్నాకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మద్దతు

### జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మే 26: నిర్మల్ జిల్లా పెంబి మండల ఆదివాసీలు నిన్నటి నుండి నిర్వహిస్తున్న నిరవధిక ధర్నాకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పెంబి మండల కేంద్రంలోని ధర్నా శిబిరాన్ని సందర్శించి సంపూర్ణ మద్దతు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లిడాకూర్ తిరుపతిలి ఖానాపూర్ మండల అధ్యక్షులు లిపానుగంటి నరేష్ కుమార్‌లి పెంబి మండల కార్యదర్శి లిపల్లికొండ శ్రీనివాస్‌లి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చింతకుంట శంకర్ లు హాజరై సంపూర్ణ మద్దతు తెలియజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లిడాకూర్ తిరుపతిలి మాట్లాడుతూ కేంద్ర బిజెపి సర్కార్ ఆదివాసి గిరిజనుల పట్ల సవతి తల్లి ప్రేమను చూపుతు ఆదివాసి గూడాలకు సరైన రోడ్డు సౌకర్యం లేకుండా వాగులపై బ్రిడ్జిలు లేకుండా ఆదివాసులు ఎల్లకాలం సమస్యలతోనే బ్రతకాలని తప్పుడు పద్ధతిలో వ్యవహరిస్తూ ఆదివాసులకు తీవ్ర నష్టం చేస్తుంది. ఆదివాసులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసుకోవడానికి అటవీ శాఖ అడ్డంకులను తొలగించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేయడం జరిగింది. ఆదివాసులు సమస్యలు పరిష్కరించాలని రెండు నెలల క్రితం పాదయాత్రగా వెళ్లి కలెక్టర్ ని కలిశారు. సమస్యలు పరిష్కారం కాలేదు .కావున కలెక్టర్ శిబిరాన్ని సందర్శించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కలెక్టర్ కి విజ్ఞప్తి చేసింది. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ఆదివాసీలు పోరాడాలన్నారు. ధర్నా శిబిరంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు లితొడసం శంభులి మండల నాయకులు లిఆత్రం డానియల్‌లి లినిర్మల బాయిలి తదితరులు పాల్గొన్నారు.

## వివో ఏలా నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపిన అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మే 26: దిలావరపూర్ మండలంలో వి ఓ ఎ లు చేస్తున్న నిరవధిక సమ్మెకు తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం జిల్లా పక్షాన మద్దతు తెలుపుతున్నట్లు జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్ అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం లోనీ సుమారు పద్దెనిమిది వేల వి ఓ ఎ లు ఈ నెల 22 నుండి నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం నిర్లక్షం చేయడం అన్యాయం అన్నారు ప్రభుత్వం వెంటనే వి ఓ ఎ ల న్యాయమైన డిమాండ్ లను వెంటనే నెరవ్చాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వివోఏలు నాయకులు పురుషోత్తం ,రవీందర్ ప్రశాంత తదితరులు పాల్గొన్నారు

# సువర్ణపురంలో ఘనంగా 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాలు

## బాల్య వివాహాల నిర్మూలన, పోషకాహారంపై విస్తృత అవగాహన



ముదిగొండ మండలం మే 26 వాయిస్ టుడే: స్థానిక సువర్ణపురం గ్రామంలో మంగళవారం నాడు "99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా మహిళలు, కిషోర బాలికలు, పిల్లల ఆరోగ్యం మరియు సామాజిక భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. లిరక్తహీనత నివారణకు పోషకాహార ప్రదర్శన:లి కార్యక్రమంలో భాగంగా గర్భిణీలు, బాలింతలు మరియు పిల్లల్లో రక్తహీనతను నివారించే ఉద్దేశ్యంతో ప్రత్యేకంగా 'పోషకాహార ప్రదర్శన'ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు రోజువారీగా తీసుకోవాల్సిన పౌష్టికాహారం, విటమిన్లు, మరియు ఐరన్ ప్రాముఖ్యత గురించి వివరించి, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు.

### "బాల్య వివాహం – బతుకు ఆగం" పై అవగాహన:

అనంతరం కిషోర బాలికలు, గ్రామ పెద్దలతో "బాల్య వివాహం – బతుకు ఆగం" అనే అంశంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చట్టప్రకారం అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలని అధికారులు స్పష్టం చేశారు. తక్కువ వయసులో వివాహాలు చేయడం వల్ల అబార్షన్లు జరగడం, శిశు మరణాలు సంభవించడం, పుట్టే బిడ్డలు తక్కువ బరువుతో పుట్టడం వంటి తీవ్రమైన ఆరోగ్యపరమైన అనర్థాలు కలుగుతాయని వారు వివరించారు.బాల్య వివాహాలను ప్రోత్సహించడం, జరిపించడం చట్టరీత్యా నేరమని అధికారులు హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి పెళ్లి చేసిన తల్లిదండ్రులకు, బంధువులకు, పురోహితులకు రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా కూడా విధించడం జరుగుతుందని స్పష్టం చేశారు.ఆపదలో ఉన్నప్పుడు మరియు బాల్య వివాహాలను అడ్డుకోవడానికి గ్రామస్తులు వెంటనే స్పందించి టోల్ ఫ్రీ నంబర్లు 1098 (చైల్డ్ లైన్), 100 (పోలీస్), 181 (మహిళా హెల్ప్ లైన్) లకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమం చివరలో అధికారుల ఆధ్వర్యంలో అందరిచేత 'పోషణ ప్రతిజ్ఞ' చేయించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ (ACDPO) జి.ఎస్. శాంతి, సూపర్వైజర్ బి. గోపమ్మ, ఏఎల్ఎంఎస్సీ (ALMSC) కమిటీ సభ్యురాలు పద్మకుమారి, ఆశా కార్యకర్తలు, వివో (VO) సభ్యులు, అంగన్వాడీ టీచర్లు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## బిజిగీర్ షరీఫ్ దర్గా ఉర్సు ఉత్సవాల భాగంగా బందోబస్తు ఏర్పాట్లును పర్యవేక్షించిన కరీంనగర్ జిల్లా కమిషనర్ గౌష్ ఆలం



జమ్మికుంట మే 26 (వాయిస్ టుడే): ఈనెల 28వ తేదీ నాడు ప్రారంభం కానున్న బిజీగిర్ షరీఫ్ దర్గా ఉర్సు ఉత్సవాల బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించుటకు మంగళవారం రోజున కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, హుజురాబాద్ ఏసిపి మాధవి, జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ దర్గా వద్ద హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్గా లోని హజ్రత్ సయ్యద్ ఇంకుషావలి రహమతుల్లా ఆలై,హజ్రత్ సయ్యద్ అజ్మత్ షావలి రహమతుల్లా అలై,హజ్రత్ సయ్యద్ అక్బర్ షావలి రహమతుల్లాఅలై సమాధులను దర్శించుకుని చాదర్లును సమర్పించారు. మత గురువు మౌలానా మొహమ్మద్ నౌమాన్ హస్మి గారు ప్రత్యేక ప్రార్థనలు చేసినారు. దర్గా కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో వీరికి శాలువాతో సన్మానించారు. కరీంనగర్ సిపి మాట్లాడుతూ బిజిగిర్ షరీఫ్ గ్రామంలో మూడు రోజులపాటు జరిగే ఉర్సు ఉత్సవాలలో వేలాది మంది భక్తులు ఉర్సు సందర్భంగా దర్గాలోని సమాధులను దర్శించుకుంటారని వీరి యొక్క బందోబస్తు కొరకు స్పెషల్ టీం పోలీసులను బందోబస్తులో పాల్గొంటారని, నిరంతర పోలీస్ నిఘ ఉంటుందని,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పినారు. ఈ కార్యక్రమంలో బిజిగిర్ షరీఫ్ గ్రామపంచాయతీ సర్పంచ్ రాచపల్లి వనజ-రాజయ్య, కార్యదర్శి ఇంగ్లా రాజు,దర్గా కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్,దర్గా కమిటీ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ కరీం, దర్గా కమిటీ కార్యనిర్వాహణ అధ్యక్షుడు మొహమ్మద్ తౌఫీక్ హుస్సేన్ దర్గా కమిటీ కార్యదర్శి మొహమ్మద్ జమాల్ అష్రాఫ్,దర్గా కమిటీ సంయుక్త కార్యదర్శి మహమ్మద్ నయీముద్దీన్ సభ్యులు సర్వర్,అలీ షరీఫ్, అజ్మత్,మాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదులో నియోజక వర్గాన్ని అగ్రస్థానంలో నిలుపుదాం

### సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్



కరీంనగర్, మే 26(వాయిస్ టుడే): బి ఆర్ ఎస్ అధ్యక్షుడు,తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు పార్టీ సభ్యత్వ నమోదులో కరీంనగర్ నియోజకవర్గాన్ని తెలంగాణలోనే అగ్రస్థానంలో నిలుపాలని మాజీ మంత్రి గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. నియోజక వర్గ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించిన గంగుల కమలాకర్ మాట్లాడుతూ ఈసారి సభ్యత్వ నమోదు డిజిటల్ పద్ధతిలో నిర్వహిస్తుందన్నారు.సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోయేందుకు తీసుకుపోవల్సిన చర్యలపై గులాబీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.అన్ని గ్రామాల్లో ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరినీ సభ్యత్వ నమోదులో భాగస్వాములను చేసేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు హామీలను అమలు చేయకుండా తప్పించుకుంటుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని,మళ్ళీ బి.అర్.ఎస్ అధికారంలోకి వస్తుందని. కేసీఆర్ సీఎం అవుతారని స్పష్టం చేశారు.కావున పార్టీ బలోపేతమే ధ్యేయంగా సభ్యత్వ నమోదు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జీవన్ రెడ్డి,కరీంనగర్ సభ్యత్వ నమోదు ఇంచార్జీ కొండూరు రవీందర్ రావు,మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు,సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్ సింగ్,మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్,బారసా కార్పొరేటర్లు,మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు,మాజీ డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

గన్నేరువరం,మే 26(వాయిస్ టుడే): రాష్ట్ర ప్రభుత్వ "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో మహిళా వారోత్సవాల్లో భాగంగా జంగపల్లి గ్రామంలో ఉప సర్పంచ్ ప్రభాకర్ అధ్యక్షతన బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామంలో బాల్యవివాహాల నిర్మూలనకు తీసుకోవాల్సిన అనేక అంశాలు, చట్టంలో పొందుపరచిన అంశాలను గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.జంగపల్లి గ్రామాన్ని బాల్య వివాహాల నిర్మూలన గ్రామంగా తీర్చిదిద్దేలా ప్రతిజ్ఞ చేయించారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు వయసు నిండిన తర్వాత అబ్బాయిలకు,21 సంవత్సరాల వయసు నిండిన తర్వాత వివాహం జరిపించాలని,బాల్య వివాహాలపై చైల్డ్ హెల్ప్ లైన్ 1098 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కవిత,మిషన్ వాత్సల్య ప్రతినిధి సాదినేని రమేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ అంగన్వాడీ టీచర్లు రజిత సరోజన, ఆశ ఏఎన్ఎం,మహిళా సంఘాల ప్రతినిధులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వాయిస్

హైదరాబాద్
బుధవారం 27 మే 2026

## కల్పనకు స్వర్ణ పతకం



కోదాడ :మే 26(వాయిస్ టుడే ప్రతినిధి) : కోదాడ పట్టణానికి చెందిన గుండా కల్పన మైసూర్ లోని ఎస్.జి.ఎస్ దత్తపీఠం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన భగవద్గీత పోటీల్లో సంచలన విజయం సాధించి, బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. పరమపూజ్య శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామివారి ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ఈ కఠినమైన పరీక్షలో... భగవద్గీతలోని మొత్తం 18 అధ్యాయాలకు సంబంధించిన 700 శ్లోకాలను గుండా కల్పన అద్భుతంగా ఉచ్ఛరిస్తూ పూర్తి అవగాహనతో అడిగిన వెంటనే చెప్పి ఉత్తీర్ణత సాధించారు. ఈ ప్రతిభకు గుర్తింపుగా మైసూర్ దత్తపీఠంలో జరిగిన వేడుకలో పూజ్య శ్రీ గణపతి సచ్చిదానంద స్వామివారి హస్తాల మీదుగా ఆమె బంగారు పతకాన్ని అందుకున్నారు. ఈ నేపథ్యంలో, గోల్డ్ మెడల్ సాధించి కోదాడకు తిరిగి వచ్చిన గుండా కల్పనను మంగళవారం స్థానిక "గీతామృతం" కోదాడ బృందం సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. భగవద్గీత లాంటి మహోత్కృష్ట గ్రంథంపై పట్టు సాధించి కోదాడ పేరును నిలిపిన కల్పన అందరికీ స్ఫూర్తిదాయకమని ప్రతినిధులు కొనియాడారు.

## నిర్మల్ జిల్లాలోని రెండు సబ్ డివిజన్లలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహణ

**పత్రాలు లేని 135 ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు, ఒక ఆటో స్వాధీనం**

**ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి పాటించాలని పోలీసుల సూచన**



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మే 26: జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఈరోజు నిర్మల్ జిల్లాలోని రెండు సబ్ డివిజన్లలో నిర్మల్,భైంసా సబ్ డివిజన్లలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.భైంసా సబ్ డివిజన్ లోని భైంసా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతల్ బూరి గ్రామంలో, నిర్మల్ సబ్ డివిజన్ పెంబి మండలంలోని బావాపూర్ (ఆర్) గ్రామాల్లో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా గ్రామ ప్రజలతో సమావేశమై గ్రామ భద్రత, నేరాల నివారణ, యువత భవిష్యత్తుపై అవగాహన కల్పించడం జరిగింది.ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 135 ద్విచక్ర వాహనాలను, రెండు కార్లను, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగింది. అంతే కాకుండా వాహనాలకు సంబంధించిన పూర్తి సరైన పత్రాలు కలిగి ఉండాలని ప్రజలకు సూచించడం జరిగింది. అలాగే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చర్యలు తీసుకుంటూ మొత్తం పెండింగ్ లో 105 చలాన్లు వసూలు చేసి, చలాన్లకు సంబంధించి మొత్తం 18,275 రూపాయల నగదు వసూలు చేయబడింది. ప్రజలకు ట్రాఫిక్ నియమ నిబంధనల గురించి పూర్తిగా వివరించి, ప్రతి ఒక్క వాహన దారుడు ట్రాఫిక్ నియమాలను పాటించాలని తెలపడం జరిగింది. అంతే కాకుండా గ్రామ ప్రజలకు సీసీ కెమెరాల ఏర్పాటు మరియు వాటి ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. అలాగే సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్లు వాహనాలు నడపడం వంటి సామాజిక దుష్ప్రవర్తనలపై ప్రజలకు వివరించారు. అదేవిధంగా ఆస్తి సంబంధిత నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్మల్ డీఎస్పీ, భైంసా ఏఎస్పీ పోలీస్ అధికారులు, గ్రామ ప్రజలకు సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అలాగే సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపడం,మైనర్లు వాహనాలు నడపడం వంటి సామాజిక దుష్ప్రవర్తనలపై ప్రజలకు వివరించారు. ఆస్తి సంబంధిత నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్,భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ ఐపీఎస్ ఖానాపూర్ ఇన్స్పెక్టర్ అజయ్,భైంసా రూరల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ ఎస్ఐ లు పోలీసు సిబ్బంది పెద్ద ఎత్తున స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

## నకిరేకల్‌లో జూన్ 3న టీయూడబ్ల్యూజే జిల్లా మహాసభ

**- 27వ తేదీ సాయంత్రంతో ముగియనున్న సభ్యత్వాల నమోదు**

**- జిల్లా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి దాసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి**



నాగార్జునసాగర్ మే 26 వాయిస్ టుడే: నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలోజూన్ 3వ న తెలంగాణ ఉమ్మడి జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే - ఐజేయూ) నల్లగొండ జిల్లా మహాసభను అత్యంత ప్రతిష్టాత్మకంగా జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి నిర్వహిస్తున్నట్లు,జిల్లా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి దాసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి దాసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శ్రీనివాస్ రెడ్డితెలిపిన వివరాల ప్రకారం నల్లగొండలో నిర్వహించిన ఒక ముఖ్య సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు,ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా నకిరేకల్ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ వేముల వీరేశం,తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.ప్రభాకర్ రెడ్డి తదితరులు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు భారీ సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం కొనసాగుతున్న సభ్యత్వ నమోదు క్యాంపెయిన్‌కు ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా, చిన్న పత్రికల ప్రతినిధులు,ఫోటో జర్నలిస్టులు,వీడియో జర్నలిస్టుల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తోందని కృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.తీవ్రమైన ఎండలు ఉన్నప్పటికీ,యూనియన్ సభ్యులంతా క్షేత్రస్థాయిలో చురుగ్గా పాల్గొని సభ్యత్వ నమోదును విజయవంతం చేస్తున్నందుకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు,ఈ నెల 27వ తేదీ (బుధవారం) సాయంత్రంతో సభ్యత్వ నమోదు గడువు ముగుస్తుంది,జిల్లాలో ఇంకా ఎవరైనా సభ్యత్వం తీసుకోని జర్నలిస్టులు ఉంటే,వెంటనే స్థానిక మండల, నియోజకవర్గ,జిల్లా నాయకులు సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.జిల్లాలోని ప్రతి జర్నలిస్టు హక్కుల రక్షణ కోసం టీయూడబ్ల్యూజే నిరంతరం కృషి చేస్తుందని గార్లపాటి కృష్ణారెడ్డి స్పష్టం చేశారు.జర్నలిస్టుల చిరకాల స్వప్నమైన ఇళ్ల స్థలాలు,ఇంటి నిర్మాణం,హెల్త్ కార్డులు,అలాగే అక్రిడిటేషన్ కార్డుల సాధన కోసం యూనియన్ ఎల్లప్పుడూ ముందుంటుందని,ఇందుకోసం నిరంతరం పోరాడుతుందని ఆయన భరోసా ఇచ్చారు.అని తెలిపారు.



## ఎత్తిపోతల జలపాతం అద్భుత దృశ్యం

**- వర్షాలతో సంతరించుకున్న సరికొత్త శోభ**

నాగార్జునసాగర్ మే 26 వాయిస్ టుడే: ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకునే ప్రముఖ పర్యాటక క్షేత్రం ఎత్తిపోతల జలపాతం ప్రస్తుతం సరికొత్త పర్యాటక శోభను సంతరించుకుంది,సోమవారం కురిసిన అకాల వర్షాలు,అదే సమయంలో తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ కుడికాలువకు నీటిని విడుదల చేయడంతో ఎత్తిపోతలలో జలకళ సంతరించుకుంది, ఎగువ నుండి భారీగా వస్తున్న వరద నీటితో జలపాతం పాల పొంగులను తలపిస్తోంది, ఎత్తైన కొండకోనల మధ్య నుండి జలధారలు ఉరకలేస్తూ కిందకు దూకుతుండటంతో,ఆ దృశ్యం పాలు పొంగిపొర్లుతున్నట్లుగా అద్భుతంగా కనిపిస్తోంది,గత కొన్ని రోజులుగా నీరు లేక వెలవెలబోయిన జలపాతం,ప్రస్తుత వరద నీటితో ఒక్కసారిగా జీవం పోసుకుంది. చుట్టుపక్కల వాతావరణం కూడా ఆహ్లాదకరంగా మారడంతో ఈ పాలకడలి లాంటి అద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు పర్యాటకులు,స్థానికులు తరలివస్తున్నారు. ఎండ తీవ్రతతో నగర జీవితాల్లో విసిగిపోయిన పర్యాటక ప్రేమికులకు ఈ జలపాత దృశ్యాలు సరికొత్త ఉత్తేజాన్ని ఇస్తున్నాయి.జలపాతం నుండి వచ్చే చల్లటి తుంపరులు,చుట్టూ అల్లుకున్న పచ్చదనం పర్యాటకులను ఎంతగానో మైమరపిస్తున్నా యి,ఫోటోగ్రాఫర్లు ఈ అద్భుత క్షణాలను తమ కెమెరాల్లో బంధిస్తూ సందడి చేస్తున్నారు,ప్రకృతి ప్రేమికులు మరియు పర్యాటకులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు,ఈ అద్భుతమైన వీకెండ్ స్పాట్‌ను వీక్షించేందుకు పర్యాటకులకు మరింత సంతోషాన్ని కల్పిస్తోంది.

## కాటూరులో కుష్టు రోగులకు నిత్యావసర సరుకుల పంపిణీ



కృష్ణా జిల్లా గన్నవరం (వాయిస్ టుడే): కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం కాటూరు గ్రామంలో మానవత్వంతో కూడిన ఓ గొప్ప సేవా కార్యక్రమం నిర్వహించారు. 'ఫార్ కార్నర్స్ మిషన్స్' డైరెక్టర్లు ఆశిష్ కుమార్, ప్రవీణ్ కుమార్ ల సౌజన్యంతో గ్రామానికి చెందిన 40 మంది కుష్టు వ్యాధి బాధితులకు (కుష్టు రోగులకు) నెలకు సరిపడా నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేశారు. కాటూరు గ్రామంలోని వేమూరి జాన్సన్ నివాస ఆవరణంలో ఈ కార్యక్రమం జరిగింది. సిడ్నీ స్కూల్ కరస్పాండెంట్ శాంతి గారి ఆధ్వర్యంలో ఈ పంపిణీ కార్యక్రమాన్ని అత్యంత క్రమశిక్షణతో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. సమాజంలో వెనుకబడిన, అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలను ఆదుకోవడం అందరి బాధ్యతని, వారి ముఖాల్లో ఆనందం చూడటమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. బాధితులకు నెలరోజుల పాటు ఇబ్బంది లేకుండా అన్ని రకాల నిత్యావసర వస్తువులను అందించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, స్వచ్ఛంద సేవకులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు. సరుకులు అందుకున్న బాధితులు ఫార్ కార్నర్స్ మిషన్స్ డైరెక్టర్లకు, సిడ్నీ స్కూల్ కరస్పాండెంట్ శాంతి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు..



## ఆదివాసి గ్రామాలకు కడెం, దొత్తి వాగు నిర్మాణానికి, అడవి శాఖ అనుమతులు ఇవ్వాలని సిపిఎం డిమాండ్

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మే 26: 2వ రోజు నిరవధిక నిరసన దీక్షల సందర్భంగా కళ్ళకి గంతలు కట్టుకొని నిరసన తెలియడం జరిగింది ఈ సమస్య పరిష్కారం అయ్యేవరకు కొనసాగుతాయి. ఈ సందర్భంగా లిసీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ బొమ్మెన.సురేష్‌లి మాట్లాడుతూ,రెండు రోజుల నుంచి నిర్మల్ జిల్లా పెంబి మండల కేంద్రంలో ఫారెస్ట్ ఆఫీసు ముందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరవధిక నిరసన దీక్షలు కొనసాగుతున్న ఖానాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే,ఆదిలాబాద్ ఎంపీ వెంటనే స్పందించి ఈ సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాల్సింది అవసరం ఉందని సిపిఎం పార్టీ నిర్మల్ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుంది.

### ప్రధాన డిమాండ్లు

దోత్తి వాగు, కడం వాగులపై వంతెనలను తక్షణమే నిర్మించాలి.

పెంబి--పులగంపండ్రి నుండి సిరిచల్మా వరకు రహదారి నిర్మాణం చేపట్టాలి.

పసుపుల--మందపల్లి--రాజూరా వంతెనల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి.

అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి. ఆదివాసి గ్రామంలో సెల్ ఫోన్ టవర్ ను ఏర్పాటు చేయాలి. త్రీ పేజ్ కరెంటు, అడవి హక్కు పత్రాలు ఉన్న భూములలో, బావులు గాని నూతులు గాని దగుకునే విధంగా

అటవీ శాఖ అనుమతులను వెంటనే జారీ చేయాలి.

అన్ని గిరిజన గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ, ఆశా వర్కర్ పోస్టులను భర్తీ చేయాలి.

పోడు సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలి.

ప్రతి గ్రామానికి మంచినీటి సౌకర్యం కల్పించి, మిషన్ భగీరథ నీటిని అందుబాటులోకి తేవాలి.

అనంతరం లిసీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు తొడసం.శశీభులి మాట్లాడుతూ, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం అయ్యే వరకు సీపీఐ(ఎం) నిరంతర పోరాటం చేస్తుందని అన్నారు. ఆదివాసి గ్రామాల సమస్యలపై గతంలో పాదయాత్ర నిర్వహించి జిల్లా కలెక్టర్ కి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది, ఇప్పటికైనా ఆదివాసీ గ్రామాలకు నెట్‌వర్క్ సౌకర్యం, ప్రతి గ్రామానికి రహదారి సదుపాయం కల్పించాలని, రేషన్ బియ్యాన్ని గ్రామ స్థాయిలోనే పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లిసీపీఐ(ఎం) మండల నాయకులు ఆత్రం బాబురావు నిర్మల, వివిధ గ్రామాల ఉపసర్పంచులు పసుపుల గ్రామ ఉపసర్పంచ్ శ్రీనివాస్ గుమేన ఏగులపూర్ ఉపసర్పంచ్ ధర్మరాజు గ్రామాల పటేల్స్ రాజన్న లింబ రావు, ఏకం బాబురావు,రాజు, కుమ్ర బాలేరావ్,లి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్.ఎస్.పి క్వార్టర్ల నోటీసులపై బిఆర్ఎస్ నిరసన

నాగార్జునసాగర్ మే 26 వాయిస్ టుడే: నాగార్జునసాగర్ నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎస్పి క్వార్టర్స్ నివాస గృహాలను ఖాళీ చేయాలంటూ అధికారులు నోటీసులు జారీ చేయడంపై బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు మంగళవారం,సాగర్ ఇంజనీర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు, అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీతారాం కు వినతి పత్రం అందజేశారు,ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మాజీ కౌన్సిలర్,తెలంగాణ ఉద్యమకారుడు రమేష్ జి మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఇక్కడే నివసిస్తున్న ప్రజలను అర్ధాంతరంగా ఇళ్లు ఖాళీ చేయమనడం అత్యంత దారుణమని మండిపడ్డారు,మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మిర్యాలగూడ సభా వేదికపై సీఎం స్వయంగా మాట్లాడుతూ 58,59 జీవోల ప్రకారం క్వార్టర్స్ నివాసితులకు ఇళ్లు క్రమబద్ధీకరించి అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆ హామీని పూర్తిగా తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. ఇప్పటికే 58,59 జీవోల ప్రకారం రిజిస్ట్రేషన్ పూర్తయిన ఇళ్లకు కూడా మళ్లీ నోటీసులు ఇవ్వడం అధికారుల నిర్లక్ష్యానికి, హాస్యాస్పద వైఖరికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా స్థానిక శాసనసభ్యులు, అధికారులు స్పందించి నివాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బాధితులకు న్యాయం జరిగే వరకు బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ నాయకత్వంలో ప్రజల తరఫున పోరాడటానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన హెచ్చరించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు నకరికంటి సైదులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. నివాసితుల పక్షాన నిలబడి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మున్ముందు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో 10వ వార్డు ఇంచార్జ్ కోడా విజయ్,2వ వార్డు ఇంచార్జ్ మహమ్మద్ గని,4వ వార్డ్ ఇంచార్జ్ విజయ్,6వ వార్డ్ ఇంచార్జ్ చంద్రమౌళి నాయక్,ఆదాసు విక్రమ్,కోదండ,నరేష్, నజీర్,షరీఫ్,ఎస్కే రఫీ భాష,శేఖరా చారి,లక్ష్మణ్ నాయక్,రవి తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహంపై అవగాహన సందస్సు



వాయిస్ టుడే మహబూబ్నగర్ జిల్లా మే 26: జడ్చర్ల /నవాబు పేట్ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ మరియు చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు నవాబుపేట మండలంలోని ధర్పల్లి గూరుకుంట గ్రామాలలో మొబైల్ వాన్ ద్వారా లీగల్ అవగాహన శిబిరాలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమాలలో డి ఎల్ ఎస్ ఏ మహబూబ్నగర్ డి ఇందిరా, బాల్య వివాహాల నివారణ, చట్టం, ఆశా స్కీం, సైబర్ క్రైమ్ సీనియర్ సిటిజెన్ యాక్ట్ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని ముఖ్యంగా ఉద్దేశించి మాట్లాడుతూ సేవల ప్రాముఖ్యత, చిన్నారుల రక్షణకు సంబంధించిన చట్టాలు, మరియు ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అలాంటి సంఘటనలు గమనించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అలాగే పిల్లలపై లైంగిక నేరాల నివారణకు సంబంధించి పి ఓ సి ఎస్ ఓ చట్టంలోని ముఖ్య అంశాలను వివరించారు. ఈ అవగాహన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని గ్రామ ప్రజలు, మహిళలు, యువత, విద్యార్థులు పాల్గొని న్యాయ సేవలపై అవగాహన ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ యువత పాల్గొన్నారు.





# విధి నిర్వహణకు ఫిట్‌నెస్ మంత్రం

**ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు**

**ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక యాక్షన్ 99లో భాగంగా పైలాన్ నుండి**

**డౌన్ పార్క్ వరకు 10కే రన్ నిర్వహించిన ఎస్పీఎఫ్ సిబ్బంది**

నాగార్జునసాగర్, మే 26 వాయిస్ టుడే: ఎస్పీఎఫ్ సిబ్బంది శారీరక దారుఢ్యంతో ఉన్నప్పుడే విధులను సమర్థవంతంగా నిర్వర్తించగలరని టీజీఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు ప్రతాప్ నాయుడు, శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా, జోన్ డీఐజీ మాధవరావు ఆదేశాల మేరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక యాక్షన్ 99 కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎస్పీఎఫ్ ఆధ్వర్యంలో పైలాన్ పిల్లర్ నుండి హిల్ కాలనీ డౌన్ పార్క్ వరకు 10 కిలోమీటర్ల రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఫిజికల్ ఎక్సర్‌సైజులు కూడా చేపట్టారు. టీజీఎస్పీఎఫ్ సిబ్బంది నిత్యం ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, శారీరకంగా దృఢంగా ఉన్నప్పుడే విధుల్లో చురుగ్గా పాల్గొనగలమని ఇన్‌స్పెక్టర్లు సూచించారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో టీజీఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బంది, నాగార్జునసాగర్ డ్యాం టీజీఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**